PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
RNI : TELTEL/2021/80267
సంపుటి: 6 సంచిక: 94, పేజీలు - 08
శనివారం,అక్టోబర్ 03, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం




# ప్రభుత్వ బడుల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్

## - పౌష్టికాహారాల తెలంగాణ ఇక వేగవంతం

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు
- రూ.9.17 కోట్లతో నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో ఆధునిక కమ్యూనిటీ కిచెన్లు
- జున్నా సోలార్ సిస్టమ్స్ రూ.5.17 కోట్లు.. చైన్ ల్యాబ్స్ ఇండియా రూ.4 కోట్లు
- నవంబర్ 30లోగా కిచెన్ల నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- విద్యార్థుల ఆరోగ్యం, విద్యా పురోగతిపై ట్రాక్ రికార్డు
- ఆహార నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు శుక్రవారం సీఎం సమక్షంలో జరిగాయి. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్లు ప్రారంభమవ్వాలని స్పష్టంగా చేశారు.

**నాగర్‌కర్నూల్ సెంట్రల్ కిచెన్‌కు రూ.5.17 కోట్ల విరాళం**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రుచికరమైన, పోషకాలతో కూడిన అల్పాహారం(బ్రేక్‌ఫాస్ట్) అందించే బృహత్తర కార్యక్రమంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యంత ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటుకు సహకారం అందిస్తున్న జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సంస్థ సీఎం శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబులు రూ.5.17 కోట్ల విరాళం చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్ కు అందజేశారు. ఈ నిధులతో నాగర్‌కర్నూల్ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన, వేడివేడి టిఫిన్ తయారీకి అవసరమైన కిచెన్ మౌలిక వసతులను నిర్మించనున్నారు.

**వికారాబాద్ సెంట్రల్ కిచెన్‌కు రూ.4 కోట్ల సహాయం**

అలాగే వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం నిర్మించనున్న ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకు వచ్చింది.

ఆ సంస్థ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ లు రూ.4కోట్ల విలువైన ఆర్థిక సాయం చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫౌండేషన్ ప్రతినిధులకు అందించారు. సామాజిక బాధ్యతతో విద్యార్థుల పోషకాహారం కోసం విరాళాలు అందించిన ఉభయ సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

2లో..

## స్మిత్ మచ్చర్‌తో ప్రధాని మోదీ

# వీడియో కాల్

## - ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించానన్న స్మిత్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఒమన్ కో-పైలట్ దాడికి తెగబడి విమానాన్ని కూల్చేందుకు యత్నించిన వేళ ప్రాణాలను పణంగా పెట్టి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ఆసుపత్రి బెడ్ మీద ఉండి చికిత్స పొందుతున్న స్మిత్ మచ్చర్‌తో శుక్రవారం రోజున ప్రధాని మోదీ దాదాపు 10 నిమిషాల పాటు వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. ఆపద సమయంలో ఆయన చూపిన అసమాన ధైర్యం, ఓర్పు, సమయస్ఫూర్తి 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పెంచాయని ప్రధాని కొనియాడారు.

**- ప్రధానితో మాట్లాడుతూ..**

**కన్నీటిపర్యంతం అయిన స్మిత్**

ఈ వీడియో కాల్ సంభాషణలో ఘటన జరిగినప్పటి భయానక క్షణాలను గుర్తుచేసుకుంటూ

2లో..

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

## - టీఆర్ఎస్ పోటీతో మారనున్న ఉపఎన్నిక సమీకరణాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రాభవాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది.

**ఓటు బ్యాంకును సృష్టించుకోవడమే కవిత టార్గెట్**

ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ

2లో..

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

### - రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్




అమరావతి (ప్రశ్న న్యూస్) రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా

2లో..

# కరవు సీమను.. సిరుల సీమగా!

- మదనపల్లెలో రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- 201 క్లస్టర్లు.. 5,869 గ్రామాలు.. 6 లక్షల ఎకరాల్లో అదనపు ఉద్యాన సాగు
- 9.6 లక్షల మంది రైతులకు ప్రయోజనం.. 'సీడ్ టు షిప్‌మెంట్' వ్యవస్థ
- రిలయన్స్ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్






**అమరావతి (ప్రశ్న న్యూస్)** రైతు సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో రాయలసీమ ప్రాంతం త్వరలోనే దేశానికే ఫ్రూట్ బౌల్‌గా మారనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె వేదికగా జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహాత్మా గాంధీ గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్న ఆశయానికి అనుగుణంగా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక

2లో..

# టీజీ ట్రాన్స్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

## - రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి

2లో..

# ఆటో ఛార్జీలు పెంపు..

## కనీస ఛార్జీ రూ.30

### - రవాణా శాఖ కీలక ఉత్తర్వులు

- 12 ఏళ్ల తర్వాత సవరించిన ఆటో ఛార్జీలు
- రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఒకటిన్నర రెట్లు అధిక ఛార్జీ
- మూడు నెలల్లో మీటర్లు మార్చాలని డ్రైవర్లకు ఆదేశాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఆటో ప్రయాణికులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో ఆటో ఛార్జీలను సవరిస్తూ తెలంగాణ రవాణాశాఖ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో మీటర్ ఛార్జీలను పెంచారు. కొత్త విధానం ప్రకారం ఇకపై మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఉంటుంది. ఆ తర్వాత ప్రతి అదనపు కిలోమీటర్‌కు రూ.14 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. గతంలో కనీస ఛార్జీ రూ.20 ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.11గా ఉండేది. రవాణాశాఖ సవరించిన ఛార్జీల ప్రకారం మొదటి 1.6 కిలోమీటర్లకు రూ.30 కనీస ఛార్జీ వర్తిస్తుంది. 1.6 కిలోమీటర్లు దాటిన తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14 చొప్పున అదనంగా వసూలు చేయాలి. దీంతో స్వల్ప దూరాలకు వెళ్లే ప్రయాణికులపై

2లో..

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

## - కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్

## - ముంబయి శివాజీ పార్క్‌లో భారీ నిరసన



ముంబై (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శుక్రవారం ముంబయి శివాజీ పార్కులో జైల్ భరో ఆందోళన మొదలుపెట్టింది. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ జులైలో ఢిల్లీలో సీజేపీ పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన ఘర్షణలు, పోలీసుల చర్యలతో పోలిస్తే ముంబయి పోలీసుల వైఖరి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. అంతేకాదు, ఢిల్లీ డీసీపీ సచిన్ శర్మను 'జనరల్ డయ్యర్'తో పోల్చుతూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

2లో..

# గాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకం

## - గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు.

2లో..

# నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి

## - రాష్టానికి ఏం చేయగలనో చెప్పండన్న అనంత్ అంబానీ



అమరావతి (ప్రశ్న న్యూస్) రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో..

# ప్రభుత్వ బడుల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా గ్రాండ్ లాంచ్

ఈ సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పనుల గడువును స్పష్టం చేశారు. నవంబర్ 30వ తేదీలోగా నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఈ సెంట్రల్ కిచెన్ల సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కిచెన్లలో ఆహారం తయారయ్యే విధానం, పరిశుభ్రతను నేరుగా తెలుసుకునేలా విద్యార్థులకు ఆయా సెంట్రల్ కిచెన్ల సందర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని.. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలన్నారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని.. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సీఎం ఆదేశించారు.

### శాశ్వత కార్యక్రమంగా బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలని సీఎ స్పష్టం చేశారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామన్నారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇది అని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్మిత్ మచ్చర్‌తో ప్రధాని మోదీ వీడియో కాల్

కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. "నాకు 17 ఏళ్ల విమాన ప్రయాణ అనుభవం ఉంది. గత 11 ఏళ్లుగా కెప్టెన్‌గా సేవలు అందిస్తున్నాను. కళ్లు మూసుకున్నా సరే విమానం ఏ పరిస్థితిలో ఉందో నేను సరిగ్గా గ్రహించగలను. కో-పైలట్ నాపై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలతో కిందపడిపోయాను. విమానం క్షణాల్లో దాదాపు 14,000 అడుగుల కిందకు పడిపోతున్నట్లు నాకు అర్థమైంది. నేను గాయపడ్డాను కానీ విమానంలో ఉన్న ప్రయాణికులను చావనివ్వకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను" అని ప్రధానికి వివరించారు.

### కష్టమైనా కాక్‌పిట్ తలుపులు తెరిచి.!

తన ప్రాణాల కంటే ప్రయాణికుల ప్రాణాలే ముఖ్యమని భావించిన స్మిత్ మచ్చర్.. తీవ్రమైన గాయాలతో రక్తం ఓడుతున్నప్పటికీ తీవ్రంగా శ్రమించి కాక్‌పిట్ తలుపులను తెరవగలిగారు. దీంతో శబ్దం విని ప్రయాణికులు, విమాన సిబ్బంది కాక్‌పిట్‌లోకి ప్రవేశించి ఆ కో-పైలట్‌ను పట్టుకుని కట్టడి చేశారు. ఈ ఘనతలో ప్రయాణికులు, సిబ్బంది అందరికీ సమాన భాగస్వామ్యం ఉందని, వారందరి సహాయంతోనే ఈ పెద్ద ముప్పు తప్పిందని స్మిత్ మోదీతో పేర్కొన్నారు. ఆ తర్వాత విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు ఫ్లైదుబాయ్ పైలట్లు విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు.

### భయమేసినప్పుడు హనుమాన్ చాలీసా చదివాను!

ప్రమాద సమయంలో తనకు తోడైన విశ్వాసాన్ని గుర్తు చేసుకుంటూ "నాకు భయమేసినా, తీవ్రమైన నొప్పి కలిగినా నేను హనుమాన్ చాలీసా జపిస్తాను. ఆ దారుణమైన క్షణాల్లో కూడా నేను హనుమాన్ చాలీసానే చదివాను. ఆ దేవుడే నన్ను, ప్రయాణికులను కాపాడాడు. నా రెండేళ్ల కుమారుడికి కూడా రోజూ ఉదయం హనుమాన్ చాలీసా వినిపిస్తాను. దేశానికి ఎంత దూరంలో ఉన్నా మన సంస్కృతికి దూరం కాకూడదు" అని మచ్చర్ మోదీకి తెలిపారు. ప్రధాని మోదీ సమాధానమిస్తూ "మీరు ఒక మహత్తరమైన కార్యాన్ని పూర్తి చేశారు, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రతీ ఒక్కరూ మీతో మాట్లాడేందుకు, మిమ్మల్ని చూసేందుకు ఆరాటపడుతున్నారు" అని ప్రశంసించారు.

# కరవు సీమను.. సిరుల సీమగా!

మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవు సీమను రూ. 1 లక్ష కోట్ల వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కేంద్ర సహకారంతో రూ. 40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల రూపంలో రూ. 60 వేల కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించారు.తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ప్రజలు తనను 'హైటెక్ సీఎం'గా, 'సీఈఓ సీఎం'గా పిలిచారని, కానీ ఇప్పుడు తనను 'వాటర్ మ్యాన్' అని గుర్తిస్తుండటం ఎంతో ఆనందాన్నిస్తోందని ముఖ్యమంత్రి భావోద్వేగానికి గురయ్యారు. ఉమ్మడి ప్రకాశంతో కలుపుకొని రాయలసీమలోని 10 జిల్లాల్లోని 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తూ, అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, రూ. 3,500 కోట్లతో హంద్రీనీవా కాలువను కుప్పం వరకు తీసుకెళ్లిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు.

### పట్టిసీమతో కృష్ణా నీరు.. నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

వాతావరణ మార్పులు, ఎల్ నినో పరిస్థితుల మధ్య కూడా పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటిని తరలించి, అక్కడ పొదుపు చేసిన నీటిని రాయలసీమకు మళ్లించామని సీఎం గుర్తుచేశారు. నాడూ పట్టిసీమ కడుతుంటే ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని, ఆనాడు పట్టుదలతో ఆ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే నేడు రాయలసీమ పరిస్థితి ఏమయ్యేదని ప్రశ్నించారు. గోదావరి నుంచి కావేరి వరకు నదులను అనుసంధానించడం ద్వారా దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. దీనివల్ల నీటి గొడవలు తొలగిపోయి కేవలం అభివృద్ధిపైనే అందరూ దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు.

### వ్యవసాయ రంగంలో నూతన లీడర్ల తయారీకి 'ఐఎస్ఏ'

రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) వ్యవసాయ రంగానికి అత్యంత కీలకం కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో టెక్నికల్ నిపుణులు తయారైనట్లే ఐఎస్ఏ ద్వారా వ్యవసాయంలో సరికొత్త లీడర్లు తయారవుతారని తెలిపారు. యాపిల్, స్ట్రాబెర్రీ, అరటి, ఆవకాడో, కివీ, డేట్స్ వంటి విభిన్న రకాల పంటలను పండిస్తూ, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ఎగుమతుల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణ కూడా సాధ్యపడుతుందని చెప్పారు.

### అంబానీ సేవలు అభినందనీయం.. కేంద్ర మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దు బిడ్డగా భావిస్తున్నామని సీఎం ప్రకటించారు. వంతారా ద్వారా జంతువులకు సేవలు అందిస్తున్న అనంత్ అంబానీ తిరుమల శ్రీవారిపై భక్తితో ఈవీ బస్సులను కూడా సమకూర్చారని ప్రశంసించారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్ విధానాల ద్వారా రైతులకు పూర్తి మద్దతు అందించాలని రిలయన్స్ సంస్థను కోరారు. అలాగే దేశ ఆర్థిక మంత్రిగా మహిళా శక్తిని చాటుతూ, జీఎస్టీ సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టులకు ఎంతో ఉదారంగా నిధులు కేటాయిస్తున్న నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాయలసీమలో పండించిన అరుదైన పండ్ల ఉత్పత్తులను కేంద్ర మంత్రికి, అనంత్ అంబానీకి సీఎం చంద్రబాబు అందజేశారు.

## శ్రీకాకుళం జిల్లాలో గాంధీ విగ్రహానికి

# ఘోర అవమానం

### - గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసి చెత్తకుప్పల్లో వేసిన వైనం

**శ్రీకాకులం** పోందూరు మండలం కనిమెట్ట గ్రామంలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసి చెత్తకుప్పలలో పడేసిన ఘటన జరిగింది. స్వాతంత్ర సమరయోధులు గుర్తుగా నెలకొల్పిన విగ్రహాన్ని మందుబాబు ధ్వంసం చేసారు. గాంధీ విగ్రహంతో పాటు చదువుల తల్లి సరస్వతీ దేవి నూతన విగ్రహాలను చెత్తకుప్పల్లో పడవేసారు.

రాత్రి, పగులు అన్న తేడా లేకుండా గాంధీ విగ్రహం సమీపంలో స్కూల్ ఆవరణలో కొందరు మద్యం సేవిస్తున్నట్లు స్థానికుల ఆరోపణ. మద్యం సేవించి రాత్రివేళల్లో స్కూల్ ఆవరణంలో వీరంగం సృష్టిస్తున్నారు. మద్యం సేవించి పాఠశాల తలుపులు, గాంధీ విగ్రహం, సరస్వతి దేవి విగ్రహాలు ధ్వంసం చేసారి పాఠశాల సిబ్బంది అంటున్నారు.

# రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది.

### బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ

ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

### ?ప్రతి ఓటు బీఆర్ఎస్‌కు నష్టమే!

దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

# టీజీ ట్రాన్స్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

# ఆటో ఛార్జీలు పెంపు.. కనీస ఛార్జీ రూ.30

కూడా కనీస ఛార్జీ రూపంలో అదనపు భారం పడనుంది. ఆటో ట్రాఫిక్‌లో చిక్కుకోవడం, సిగ్నల్ వద్ద ఆగడం, ఇతర కారణాలతో వేచి ఉండాల్సి వస్తే డిటెన్షన్ ఛార్జీ నిమిషానికి 75 పైసలుగా నిర్ణయించారు. గతంలో ఇది 50 పైసలుగా ఉండేది. అలాగే నిబంధనలకు లోబడి అదనపు లగేజీ తీసుకెళ్లే సందర్భంలో ఒక్కో ప్యాకేజీకి 50 పైసలు ఛార్జీగా నిర్ణయించారు. గరిష్ఠ లగేజీ పరిమితిని 100 కిలోలుగానే కొనసాగించారు.రాత్రి వేళల్లో ఆటోలో ప్రయాణించే వారికి ప్రస్తుతం ఉన్న నిబంధననే కొనసాగించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ ఛార్జీకి 1.5 రెట్లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అంటే సాధారణ మీటర్ ఛార్జీ కంటే 50 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుంది. కొత్త ఛార్జీలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆటో డ్రైవర్లు తమ డిజిటల్ మీటర్లను కొత్త టారిఫ్‌కు అనుగుణంగా సవరించుకోవాలని రవాణా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం 3 నెలల గడువు ఇచ్చింది. మీటర్ల రీసెట్టింగ్ పూర్తయ్యే వరకు పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డును ఆటోల్లో ప్రదర్శించాల్సి ఉంటుందని పేర్కొంది. తెలంగాణలో ఆటో ఛార్జీలను చివరిసారిగా 2014లో సవరించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన రేట్లే తెలంగాణలోనూ కొనసాగుతున్నాయి. 2014లో అమల్లోకి వచ్చిన రేట్లలో మొదటి 1.6 కిలోమీటర్లకు రూ.20 ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.11గా ఉండేది. 12 ఏళ్లకు పైగా ఛార్జీల్లో మార్పు లేకపోవడంతో ఇంధనం, వాహన నిర్వహణ, ఇన్సూరెన్స్, టైర్లు, మరమ్మతులు వంటి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తాజాగా రేట్ల సవరణ చేపట్టారు. ఆటో మెయింటెనెన్స్ ఖర్చులు, పెట్రోల్-డీజిల్ ధరలు, వాహన కొనుగోలు-ఫైనాన్స్ ఖర్చులు, ఇన్సూరెన్స్, సర్వీసింగ్, ట్రాఫిక్‌లో వేచి ఉండే సమయం, డ్రైవర్ల ఆదాయం వంటి అంశాలను పరిశీలించిన కమిటీ కొత్త రేట్లను సిఫారసు చేసింది. కమిటీ అంచనా ప్రకారం ఆటో నిర్వహణ వ్యయం రెవెన్యూ ఆర్జించే ప్రతి కిలోమీటర్‌కు సుమారు రూ.13.53గా ఉండటంతో దాన్ని రూ.14కు రౌండ్ చేసింది. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో పేర్కొన్నారు. ఆటో ఛార్జీల పెంపుతో పాటు డ్రైవర్ల సంక్షేమం, అగ్రిగేటర్ విధానం, ఇతర సమస్యలపై ప్రభుత్వం ఆటో సంఘాలతో చర్చలు జరిపింది. ఆగస్టులో సమ్మెకు పిలుపునిచ్చిన ఆటో సంఘాలు ప్రభుత్వం ఛార్జీల సవరణకు అంగీకరించడంతో సమ్మెను విరమించాయి. ప్రభుత్వం ఆర్టీసీ తరఫున ఈవీ ఆటోలు కొనుగోలు చేస్తుందనే ప్రచారాన్ని కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. పాత పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునేందుకు డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# గాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకం

సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ పోలీస్ బందోబస్తు

**న్యూఢిల్లీ** ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. సీఈసీ వ్యవహార శైలికి వ్యతిరేకంగా, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద సెక్షన్ 163 ఃఔా అమలు చేస్తూ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా శాంతియుతంగా నిరసన చేపట్టి తీరుతామని సీజేపి నేతలు తేల్చి చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పదకొండు మెట్రో స్టేషన్లను మూసివేసారు. ముంబైలో సీజేపీ అధినేత అభిజత్ డిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే

మహారాష్ట్ర పోలీసులను చాలా మంచివారని అభివర్ణించిన దీప్కే ముంబయిలో తమకు ఎదురైన అనుభవాన్ని, జంతర్ మంతర్ నిరసనల సమయంలో ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును పోల్చి చూపుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు."నన్ను అదుపులోకి తీసుకోవాలని ముంబయి పోలీసులకు ఉత్తర్వులు వచ్చాయి, కానీ వారు ఎంత మంచివాళ్లంటే, నాకు టీ ఆఫర్ చేసి వెళ్లిపోమన్నారు. అదే ఢిల్లీలో అయితే డీసీపీ సచిన్ శర్మ ఒక క్రూరుడిలా (మోన్‌స్టర్) వ్యవహరిస్తారు. డీసీపీ సచిన్ శర్మ అమిత్ షాకు 'జనరల్ డయ్యర్' లాంటివారు" అని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అత్యంత క్రూరమైన ఘటనగా నిలిచిపోయిన జలియన్ వాలాబాగ్ కాల్పుల ఉదంతం. దీనికి ప్రధాన కారకుడు బ్రిటిష్ జనరల్ ఓ డయ్యర్.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ కార్యకర్తలు, హక్కుల సంఘాల ప్రతినిధులు భారీగా శివాజీ పార్క్ వద్దకు చేరుకోవడంతో నిరసన తీవ్రతరమైంది. దీంతో వేదిక వద్ద పోలీసులను భారీగా మోహరించారు. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా చేపట్టబోయే భారీ ఆందోళన కార్యక్రమానికి ఈ ముంబయి నిరసన ఆరంభం మాత్రమేనని తెలిపారు. ఈ ఉద్యమానికి ముంబయి నగరమే వేదికగా మారిందని పేర్కొంటూ నగరవాసులంతా ఈ నిరసనలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జులై 20 న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ దాస్ మాట్లాడారు. సీజేపీ చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు వెళ్లేందుకు యత్నించిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. వారిని చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించి, పలువుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారుల్లో కొందరు రాళ్లు విసిరారని ప్రత్యక్ష సాక్షుల కథనాలను ఉటంకిస్తూ పీటీఐ నివేదించింది. ఈ ఘటనతో సెంట్రల్ ఢిల్లీ స్తంభించిపోయింది. భద్రతా కారణాల దృష్ట్యా పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పార్లమెంట్ పరిసరాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి

నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో చారిత్రక, జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్ టాగూర్ మదనపల్లెలోనే ఆంగ్లంలోకి అనువదించారని గుర్తుచేశారు. గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ నినాదాలను, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్', వాజ్‌పేయి 'జై విజ్ఞాన్', ప్రధాని మోదీ 'జై అనుసంధాన్' నినాదాలను ఉటంకిస్తూ ఈ నాలుగు నినాదాల కలయికతోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని వివరించారు.టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అనంత్ ప్రకటించారు. "ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తాం. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో చెప్పే వ్యవస్థను రూపొందిస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను 'ఊర్జాదాతలు' (శక్తి ప్రదాతలు)గా మారుస్తాం" అని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# పేర్ని నానికి దారెటు...

**విజయవాడ :** మచిలీపట్నం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పేర్ని నాని ప్రదర్శించిన అసహనం, ఆయన చేసిన వ్యాఖ్యలు నానిలో ఆశలు అడుగంటిపోయిన తీరును స్పష్టం చేస్తోంది. గత ఐదేళ్ల పాలనలో సొంత సామాజిక వర్గానికి, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయలేదనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి బలంగా వినిపిస్తుండటంతో ఆయన తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. సమావేశంలో నిలదీతలు ఎదురవడంతో, ఎమ్మెల్యేలకు కులాలు ఏంట్రా? అంటూ ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలు సొంత పార్టీ వర్గాల్లోనే చర్చకు దారితీశాయి.సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో సామాజిక సమీకరణాలను బలంగా ఉపయోగించుకున్న నాయకుడే ఇప్పుడు ఎమ్మెల్యేలకు కులాలేంటి అని మాట్లాడాల్సి రావడం వెనుక ఉన్న నైరాశ్యాన్ని చూపిస్తోంది. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో మచిలీపట్నంలో కాపు సామాజిక వర్గానికి గానీ, క్షేత్రస్థాయి కార్యకర్తలకు గానీ ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత దక్కలేదనే అసంతృప్తి కేడర్‌లో నెలకొంది. దానికి సమాధానం చెప్పలేక, భావోద్వేగపూరిత వ్యాఖ్యలతో కార్యకర్తల గళాన్ని అణచివేసే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సొంత కేడర్ నుంచి వచ్చిన ప్రశ్నల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్రపై ఆరోపణలు గుప్పించారన్న విమర్శలు వస్తున్నాయి. టీడీపీలో పదవులు అమ్ముకుంటున్నారని, తాను మాత్రం కష్టపడిన వారికే గుర్తింపునిచ్చానని పేర్ని నాని చెప్పుకొచ్చినప్పటికీ, అది ప్రత్యర్థిపై నెపం నెట్టే ప్రయత్నంగానే కనిపిస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా టీడీపీ కూటమి బలంగా పుంజుకోవడం, మంత్రిగా కొల్లు రవీంద్ర దూకుడు ప్రదర్శిస్తుండటంతో వైసీపీ నేతలు ఆత్మరక్షణలో పడ్డారనే సంకేతాలు ఈ సమావేశం ద్వారా స్పష్టమయ్యాయి.ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తన కుమారుడు పేర్ని కిట్టు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడం కూడా నానిని మరింత ఇబ్బందికి గురిచేస్తోందనే చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడంలో నాయకత్వం విఫలమవుతోందని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో పేర్ని నాని వ్యవహరించిన తీరు భవిష్యత్ రాజకీయాలపై చేతులెత్తేసిన భావనను కలిగిస్తోందని, నియోజకవర్గంలో పట్టు నిలుపుకోవడం వైసీపీకి పెను సవాలుగా మారిన సూచనలు కనిపిస్తున్నాయి.

# గ్రేటర్ ఎన్నికలపై ఆచితూచి అడుగులు

**హైదరాబాద్ :** ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు. ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. (కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొంత కలకలం రేపాయి. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమోననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యంత్రాంగం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కొంతమంది విలీనమైనప్పటికీ, వార్డు స్థాయిలో 300 వార్డుల పరిధిలో సరైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడం కాంగ్రెస్‌కు ఐక్యతాపరంగా పెద్ద సవాలుగా మారనుంది. పార్టీ అంతర్గత విభేదాలు బయటపడితే గ్రేటర్ గెలుపుపై ప్రభావం పడుతుందనే యోచనలో నాయకత్వం ఉంది.

# సిపిఎస్ రద్దు చేయాలి, ఉద్యోగులకు డి ఎ బకాయిలు వెంటనే చెల్లించాలి




**తిరుపతి** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ కమిషన్‌ను నియమించి, రెండు పీఆర్సీలను విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కి మరియు ఉప ముఖ్యమంత్రి కి ఏపీ సీపీ ఎస్ ఈ ఏ ఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ మరియు రాష్ట్ర కార్యవర్గం ధన్యవాదాలు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులకు 2018 నుంచి రావాల్సిన కరువు భత్యం ( డి ఎ ) బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసింది. దాదాపు 48 నెలల డి ఎ బకాయిలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందని పేర్కొంది. అలాగే రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులకు 2018 నుంచి అమలవుతున్న ఆంక్షలను తొలగించి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ సి పి ఎస్ ఈ ఏ కోరింది. ఈ సందర్భంగా సంఘం పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. ప్రధాన డిమాండ్లు:సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీస్ ను పునరుద్ధరించాలి. ప్రతి ఉద్యోగికి రావాల్సిన కరువు భత్యం బకాయిలను పూర్తిగా చెల్లించాలి. జీవో నెంబర్ 53 అమలు మార్గదర్శకాలను విడుదల చేయాలి. 30% ఐర్ ను అమలు చేయాలి. పి ఆర్ సి కాలపరిమితిని వీలైనంత త్వరగా నిర్ణయించాలి. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సచివాలయ ఉద్యోగులకు అధికారిక వెర్షన్లు ఇవ్వాలి. సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి. ద్రవ్యోల్బణం 9 నెలల ఆలస్యం అయినందున నష్టపోయిన సర్వీసును ముందుకు జరపాలి. సచివాలయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న స్పెషల్ ప్రొవిజన్ డ్యూస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఉద్యోగులకు న్యాయం చేయాలని ఏపీ సిపిఎస్పిఏ రాష్ట్ర అధ్యక్షులు భాజీ పఠాన్, అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్, ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వర్ రావు విజ్ఞప్తి చేసారు. ఈ నిరాహార దీక్ష కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గం సభ్యులు పాలేలా రామాంజనేయులు, హుస్సేన్, జనార్దన్, ఉమా మహేశ్వర్ రావు, రాంభూపాల్ రెడ్డి, మురళీ, రామనరసింహ, మణికంఠ, ఈశ్వర్ నాయక్, కోదండ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి...

**- తిరుపతిలో వామపక్షాల నిరసన.**



**తిరుపతి** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాలుగు కాళ్ల మండపం నుండి గాంధీ విగ్రహం వరకు సాగిన ఈ ప్రదర్శనలో నాయకులు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.?ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి. మురళి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, దేశవ్యాప్తంగా అన్యాయంగా తొలగించిన 13 కోట్ల ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ భాగస్వామ్యంతో కూడిన పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.?ఇటీవల ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాలపై వెలువడిన కథనాల నేపథ్యంలో ఓటర్ల డేటా నిర్వహణ, ఓట్ల తొలగింపు అంశాలపై సమగ్ర విచారణ జరిపి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు కే. వేణుగోపాల్, జె. విశ్వనాథ్, టి. సుబ్రమణ్యం, కే. రాధాకృష్ణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## గాంధీ జయంతి స్ఫూర్తితో

# స్వచ్ఛ తిరుపతిని నిర్మిద్దాం

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి,** మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర?స్వచ్ఛతా హి సేవా అవార్డులు?2026' ప్రదానోత్సవంలో మున్సిపల్ కమిషనర్ జయకృష్ణతో కలిసి ఆయన పాల్గొన్నారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ లీగ్ పోటీల్లో తిరుపతి నగరం 2024, 2025 లలో దేశంలోనే వరుసగా టాప్3లో నిలవడం అభినందనీయమన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా స్వచ్ఛత సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేయాలని సూచించారు. తిరుపతి జిల్లా రామాపురంలో రూ.300 కోట్లకు పైగా వ్యయంతో 600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను 2027-28 నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అలాగే, నిరం తరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు.?మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ మాట్లాడుతూ.. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ను ఒక ప్రజా ఉద్యమంగా మలచి, 2047 నాటికి 'వికసిత భారత్' సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి, సంస్థలకు జిల్లా కలెక్టర్ స్వచ్ఛతా హి సేవా అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి

**అమరావతి** మహారాష్ట్రలోని అమరావతి జిల్లా సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధమన్గావ్ సమీపంలోని చానల్ 97 వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ, బొలెరో పికప్ వ్యాన్ను బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కనీసం ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. రైల్వే పరిధిలోని ధమన్గావ్ వద్ద అర్ధరాత్రి 12:45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే ధమన్గావ్ రూరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని వార్ధా మెడికల్ కాలేజీకి రిఫర్ చేశారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మంచాలలో దారుణం..

**- నాలుగేళ్ల బాలికపై అత్యాచారయత్నం**

**రంగారెడ్డి** మంచాల మండలం లోయపల్లిలో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది. సెల్ఫోన్ చూపిస్తానని ఆశ చూపించి చిన్నారిని ఇంట్లోకి పిలిచినట్లు పోలీసులు వెల్లడించారు. గ్రామానికి చెందిన బి. నరేందర్ అలియాస్ నాని (40) సెప్టెంబర్ 30న చిన్నారిపై లైంగిక దాడికి యత్నించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. రాత్రి నొప్పితో బాధపడిన బాలిక మరుసటి రోజు ఘటనను తల్లిదండ్రులకు వివరించింది. చిన్నారికి గాయాలు కనిపించడంతో కుటుంబ సభ్యులు గురువారం రాత్రి 10:30 గంటలకు డయల్-100కు సమాచారం ఇచ్చారు. తల్లి ఫిర్యాదు మేరకు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నరేందర్పై కేసు నమోదు చేసినట్లు మంచాల సీఐ మధు వెల్లడించారు. ఘటన తర్వాత నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

## ఐజేయూ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు వినతి

**- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందించాలి**



**పాలేరు :** జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా కమిటీ పిలుపు మేరకు ఖమ్మం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాయుడుపేట సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. పాలకవర్గాల నిర్లక్ష్య వైఖరి, అణచివేత ధోరణితో పాటు జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలులో చూపుతున్న వివక్షను నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలను అందించాలని వినతిపత్రంలో కోరారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**- చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు..**

**- తడి, పొడి చెత్తను వేరు చేయాలి**

**- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి:**

**- కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్**



**చర్ల :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలివేరు గ్రామ సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం చర్ల మండలంలోని కలివేరు గ్రామంలో ఐటీసీ?ఎంఎస్‌కే (బంగారు భవిష్యత్) వారి సహకారంతో మైరాడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడేందుకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ ఇళ్ల చుట్టుపక్కల పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం కేవలం ప్రభుత్వ అధికారుల బాధ్యత కాదని, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా భావించాలని అన్నారు.

**మొక్కలు నాటితేనే పర్యావరణ పరిరక్షణ** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ సూచించారు. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు వర్షపాతం మెరుగుపడే అవకాశం ఉంటుందని, తద్వారా వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడి పంటల దిగుబడులు పెరుగుతాయని ప్రజలకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటం అంటే భవిష్యత్ తరాల జీవనానికి భద్రత కల్పించడమేనని పేర్కొన్నారు.

**తడి, పొడి చెత్తను వేరు చేయాలి** గ్రామ సెక్రటరీ ఇర్పా శ్రీరామ్‌మూర్తి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయకుండా ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామం కోసం ప్రజలు అధికారులకు సహకరించడంతో పాటు స్వచ్ఛతను నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైరాడ సోషల్ మొబిలైజర్లు వి. నవీన్, వి. నాగేశ్వరరావుతో పాటు గ్రామ ప్రజలు టి. బాలకృష్ణ, పీరి నరసింహారావు, ఎన్. బాలకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల వేతనాలు పెంచి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి



**కొత్తపల్లి:** అంగన్వాడీలకు వేతనాలు పెంచి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని గాంధీ జయంతి సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కొత్తపల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి హరిత, సిఐటియు మండల కార్యదర్శి దినేష్ మాట్లాడుతూ ఐ.సి. డి. ఎస్ ఏర్పడి నేటికీ 52 సంవత్సరాలు అవుతున్నప్పటికీ అంగన్వాడీలు గౌరవ వేతనంతో పనిచేస్తున్నారని, వారిని ఇంతవరకు కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయడం లేదు అని ఆరోపించారు , మరోపక్క ప్రభుత్వం యాప్ ల పని భారం పెంచడంతో ఆన్లైన్ వర్క్ లతో అంగన్వాడీ టీచర్లు సతమతమవుతున్నారు, ఆన్లైన్ పని భారం తగ్గించి కనీస వేతనం అమలు చేయాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, మిగిలిపోయిన మినీ అంగన్వాడి వర్కర్లను మెయిన్ వర్కర్లుగా వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రంలో మెనూ చార్జీలు పెంచాలని, మెనూ క్వాంటిటీ ఇవ్వాలని, వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో నాగమణి, లక్ష్మీదేవి, నానమ్మ, పార్వతి వసంత, సుగుణ, విజయమ్మ, సుభాషిని, అంకమ్మ, రమాదేవి, శారద పాల్గొన్నారు

## ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**ఆత్మకూరు, అక్టోబర్ 2:** జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డీఎస్పీ శ్రీ. రామాంజి నాయక్ ఆధ్వర్యంలో కార్యాలయ పోలీసు సిబ్బంది మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీజీ అహింసా మార్గంలో చేసిన పోరాటాన్ని, దేశ ప్రజలకు ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది స్మరించుకున్నారు. సత్యం, అహింస, శాంతి, సహనం వంటి గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో శాంతి, సామరస్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన సిద్ధాంతాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని జాతిపిత మహాత్మా గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు.

# స్థానిక ఎన్నికలకు పోలవరం జిల్లా సిద్ధం

**- 186 పంచాయతీల పరిధిలో 1,734 పోలింగ్ కేంద్రాలు.. 2.78 లక్షల మంది ఓటర్లు**

**పోలవరం** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలవరం జిల్లాలో ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లపై దృష్టి సారించింది. జిల్లాలోని 186 గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా మొత్తం 1,734 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు. ప్రతి వార్డుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,78,545 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. మండలాల వారీగా ఓటర్ల సంఖ్య, వార్డుల పరిధి, పోలింగ్ కేంద్రాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా అడ్డతీగల మండలంలో 202 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అత్యల్పంగా గుర్తేడు మండలంలో 52 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. స్థానిక ఎన్నికల ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు అవసరమైన ఎన్నికల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## రాజనగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

**- అభివృద్ధి పనులకు ప్రాధాన్యత - వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.**



**వనపర్తి.** రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి. రాజనగర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి రాజనగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా రాజనగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆవిష్కరించి, మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆర్చి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అలాగే గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో సిసి డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి, వారిని శాలువాలతో సన్మానించి నూతన వస్త్రాలను అందజేశారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ. గ్రామంలో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, బ్రిడ్జి నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజనగర గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం, తన వంతు నుంచి పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో రాజనగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నక్క రాణి రాజు, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రాఒఔ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, వనపర్తి పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, ఔజఎ అధ్యక్షులు శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ జర్నల్ సెక్రెటరీ బ్రహ్మం చారి, మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, గొడుగు రామకృష్ణ, సంజీవ్ సాగర్, నారాయణ, కందుర్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేవనకొండ సస్యశ్యామలంగా ఉందా.. కరువు కనబడడం లేదా....

**- మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి.**
**- ప్రకటించిన జాబితా అశాస్త్రీయమైనది.**

**- ప్రభుత్వ వైఖరి పైదేవనకొండలో రాస్తారోకో నిర్వహించిన వామ పక్షాలు.**

ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా చాలా అశాస్త్రీయంగా ఉందని కర్నూల్ అర్బన్ లో ఉన్న కరువు దేవనకొండ మండలంలో ప్రభుత్వానికి అధికారులు కనబడక పోవడం చాలా శోచనీయమని ప్రజల జీవితాలతో ఆటాడుకునే రాజకీయాలు ప్రభుత్వానికి సరికాదని వెంటనే దేవనకొండ మండలాన్ని కరువు మండలం ప్రకటించాలని సిపిఐ,సిపిఎం జిల్లా నాయకులు కె మద్దిలేటి శెట్టి బి వీర శేఖర్ , నరసారావు లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిన్నటి రోజున ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో దేవనకొండ మండలంను చేర్చకపోవడన్నీ నిరసిస్తూ ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో దేవనకొండ బస్టాండ్ నందు రైతులతో కలిసి ఆ పార్టీల నాయకత్వం పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు సూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మద్దిలేటి శెట్టి, వీరశేఖర్, నరసరావులు మాట్లాడుతూ చుట్టుప్రక్కల ఉన్న అన్ని మండలాల్లో కరువుగా ప్రకటించి మధ్యలో ఉన్న దేవనకొండ మండలంలో కరువు లేదనడం చాలా విడ్డూరంగాను విచిత్రంగాను ఉందని, కళ్ళు లేని ధృతరాష్ట్రుని పాలన మాదిరిగా నేటి పాలకులు ఉన్నారని కరువు మండలాల ప్రకటనలో శాస్త్రీయత కొరబడిందని వారి విమర్శించారు ప్రభుత్వం మరియు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జూన్ జూలై దాదాపు 51 రోజులపాటు వర్షం లేదని అదేవిధంగా ఆగస్టు రెండో వారం తర్వాత 34 రోజులపాటు వర్షం లేదని ఇంతకాలం వర్షాభావ పరిస్థితులు నెలకుంటే పంటలు ఎలా చేతికొస్తాయని దిగుబడి ఎలా వస్తాయో అధికారులకు తెలియదాఅని వారు ప్రశ్నించారు దేవనకొండ మండలాన్ని కరువు రహితంగా చూపెట్టి రైతుల గొంతులు కోస్తున్నారని వారు ఆరోపించారు వేలకు వేల పెట్టుబడులు పెట్టిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, భరోసాగా ఉన్న ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని అనుకుంటే చేతులెత్తేయడం తో రైతుల బాధ వర్ణాతితంగా ఉందని వారి పేర్కొన్నారు ప్రకృతి నిరాదరణ పాలకుల నిర్లక్ష్యంతో రైతులు మరింత కుంగిపోతున్నాడని ఆదుకోవలసిన ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణమైన విషయమని పేర్కొన్నారు క్షేత్రస్థాయి రిపోర్టులు పరిశీలన తీసుకొని గ్రామాన్ని యూనిట్ గా సర్వే నిర్వహించి వర్షాభావాన్ని శాస్త్రీయంగా అంచనా కట్టి దేవనకొండ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ప్రజలు ఇంకా జగ మొండి గా ఉంటారని, కరువు ప్రకటించాల్సిందేనని వారు పేర్కొన్నారు కరువు మండలం ప్రకటించే వరకు రైతులతో కలసి ఉద్యమిస్తామని వారు పేర్కొన్నారు కరువు మండలాల ప్రకటించి నష్టపోయిన రైతుకి పంట నష్టపరిహారం బీమా పరిహారం ఉపాధి పనులు కల్పించాలని వారి డిమాండ్ చేశారు కరువు ప్రకటించకపోతే రేపు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల నుండి గట్టి గుణపాఠం ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు అశోక్, యూసుఫ్ భాష, మహేంద్ర ,శ్రీనివాసులు, బజారి, రవీంద్ర , బలరాముడు ,రంగన్న మధు, భాస్కర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# గోదావరి తీరాన ఘనంగా "సింగరేణి గంగపుత్ర ఆత్మీయ సమ్మేళనం"

## – నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**(తేజవ్యాస్ - స్టేట్ చీఫ్ బ్యూరో)**





గోదావరి నదీ తీర సమీపంలోని పవిత్ర సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద "గంగపుత్రుల విద్యావంతుల వేదిక" ఆధ్వర్యంలో 'సింగరేణి గంగపుత్ర ఆత్మీయ సమ్మేళనం' ఎంతో ఉత్సాహంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఘనంగా జరిగింది. కార్యక్రమం ప్రారంభంలో ముఖ్య అతిథులు, సంఘ పెద్దలు సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమ్మేళనానికి రామగుండం, భూపాలపల్లి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి తదితర సింగరేణి బొగ్గు గని ప్రాంతాల వారీగా సుమారు 500 మందికి పైగా ఉద్యోగులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరికీ నిర్వాహకులు ప్రత్యేకంగా రుచికరమైన భోజన వసతి ఏర్పాట్లు చేశారు.

**– ముఖ్యాంశాలు :**

**ఐక్యత, ఆత్మీయ అనుబంధాలు :** వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న గంగపుత్రుల మధ్య ఐక్యతను చాటడం, సమాజహితముగా, ఆత్మగౌరవంగా జీవించడం ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని వక్తలు పేర్కొన్నారు.

**విద్యా, సామాజిక వికాసం :** గంగపుత్ర సమాజంలో భావితరాల విద్యాభివృద్ధి కోసం విద్యావంతుల పాత్రపై విస్తృతంగా చర్చించారు.

**ఏకగ్రీవమైన నూతన కార్యవర్గ ఎన్నిక :**ఈ మహాసమ్మేళనంలో "సింగరేణి గంగపుత్రుల వేదిక" నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది:దఅధ్యక్షులుగా బంగారు రాజయ్య. ఉపాధ్యక్షులుగా అంబటి శ్రీనివాస్, పెద్దపల్లి పోచయ్య, మదనబోయిన రాజేందర్, వంగల చక్రపాణి. ప్రధాన కార్యదర్శిగా పూస వసంత్ కుమార్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా గండం శ్రీనివాస్, కీర్తి శ్రీనివాస్, పిండి సదానందం, పారుపెల్లి రాజేందర్ జక్కినబోయిన కుమారస్వామి, బోయిన శంకర్. కోశాధికారిగా బంగారు సారంగపాణి. సోషల్ మీడియా సెక్రటరీలుగా మేడి తిరుపతి, రేగుచెట్టు ముకేష్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బంగారు మల్లేశం, బాసబోయిన గోపాలకృష్ణ, దామెర కుమారస్వామి, దామెర సదానందం, పెద్దపల్లి సదానందం, ఎరువ రాజనర్సు, తల్లాల వెంకటస్వామి, అతికేటి రామస్వామి, ఆనందాల రాజనారాయణ పారుపల్లి రంజిత్ కుమార్, బొల్లి రాజలింగు, కొండూరు శివప్రసాద్, బోయిని కొమురయ్య, దగ్గుల నర్సయ్య, మొసం చందర్ రావు, వత్సూరి నవీన్, పెద్దపల్లి బానయ్య తదితరులు ఎన్నికయ్యారు. అలాగే మణుగూరు, భూపాలపల్లి, ఇల్లందు, కొత్తగూడెం ఏరియాల నుంచి కో–ఆప్షన్ సభ్యులుగా, అలాగే ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. అనంతరం కొన్ని ముఖ్యమైన తీర్మానాలు చేశారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు హాజరైన సభ్యులు ఘనంగా అభినందనలు తెలియజేశారు.

# మానవత్వం లేని సమాజం, "డిఎన్ఏ"తో బయట పడ్డ నిజం

- తనయుడు కళ్ళలో ఆనందం,తండ్రి మనసులో అనుమానం.చివరికి గెలిచింది నిజం.
- రెండున్నర దశాబ్దాల క్రితం అభిలాష్ రెడ్డి దూరమయ్యాడని మనోవేదనకు గురైన కన్న తండ్రి,అనుకోకుండా ఒక రోజు కళ్ళముందు కనిపించి నాన్న నేను వచ్చేసానంటూ కన్నీటి పర్యంతమైన కన్న కొడుకు
- సినిమా ఫక్కీలో కొనసాగిన ఈ తతంగం కొన్నాళ్లకే వృధుడి చిరాస్తిని దొంగలించాడనికి వచ్చాడని బట్టబయలైంది








**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సమాజంలో రోజు రోజుకి మానవ సంబంధాలు నకిలీ భంధాలుగా మారుతున్నాయని చెప్పకనేచెపుతున్నాయి కొన్ని సంఘటనలు.మనచుట్టూ జరుగుతున్న సంఘటనలే ఓ ఉదాహరణ మరీ ముఖ్యంగా సభ్య సమాజంలో మనుషులు సంభందాలకన్నా డబ్బులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.తన,పరాయి బేధం లేకుండ అఘాయిత్యాలకు కూడా వెనుకాడట్లేదు.ఈ మధ్యకాలంలో గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాలు కలిగిన రైతుకుటుంబంలో ఇద్దరు ముగ్గురు వారసులు ఉండగా పంపకాల్లో తేడాలు వస్తున్నాయని రక్త సంబంధాని సమాధి చేస్తూ తల్లి,తండ్రి,సోదరి,సోదరుడు సొంత వాళ్లన్న తేడాలేకుండా హత్యలు చేస్తూ అందినకాడికి దోచుకుంటూ పరలోకానికి దారిని చూపిస్తున్నారు. జంట నగరాలలో స్థలాల రేట్లు ఆకాశాన్ని అంటడంతో మోసాలకు తెరలేపుతున్న జాదూగాళ్ళు.నగరం నడిబొడ్డున ఏ మూల చూసినా చదరపు అడుగు స్థలం అర లక్ష పై మాటే ఉన్నటు బహిరంగ మార్కెట్లో తెలుస్తుంది.కొన్ని సందర్భాలలో అయితే కాలనీలు,బస్తీలు తేడా లేకుండా పిడు గుద్దులు గుద్దుకోవడమే కాకుండా రక్తంచిందేలా మారణాయుధాలతో తెగబడడం చివరికి పోలీసుల అరంగేట్రంతో జైలు పాలు కావడం ప్రతిరోజు చూస్తున్న సంఘటనలు కొక్కోలలు.ఇలాంటి సంఘటనల ఆధారంగా వెండి తెరపై ఎన్నో చిత్రాలను నిర్మించిన విషయం విదితమే.ఇలాంటి కథ నేపథ్యంలో వచ్చిన చిత్రాలు బాక్స్ ఆఫీసును కొల్లగొట్టాయి.

### ఇటీవల జరిగిన యదార్థ సంఘటన:

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం సీతారాంపేటకు చెందిన 75 ఏళ్ల పిశాపాటి లక్ష్మారెడ్డికి అయిదుగురు కూతులు ఒక కుమారుడు,అతని పేరు అభిలాష్ రెడ్డి.తన చదువు విషయంలో వెనుకపడడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థుల ముందు అవమానంగా మారడంతో అభిలాష్ రెడ్డి 2002లో పదవ తరగతి పరీక్ష తప్పడం,తల్లితండ్రిలతో విషయం చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు.

ఒక్కగాని ఒక్కకొడుకు కళ్ల ముందులేక ఎక్కడున్నాడో తెలియక వస్తాడో రాడో అర్థంకాక రెండున్నర దశాబ్దాలుగా ఆ వృద్దుడి మనోవేదన బంధుమిత్రులతో పాటు గ్రామస్థులను కలచివేసింది. ప్రతిరోజు చస్తుబ్రతుకుతున్న పిశానాటి లక్ష్మారెడ్డి ఐదుగురు కుతూర్లు అల్లాడ్లు మానవరాళ్లు,మనమళ్ళు ఇంతపెద్ద కుటుంబం ఉన్నపటికీ కొడుకు లేడు అనే బాధ ప్రతి క్షణం వెంటాడుతు ముసలి ప్రాణానికి ఆనందం దూరమైంది.

### నాన్న నేను బ్రతికే ఉన్నాను, కొడుకు పిలుపుతో వృద్ధాప్యాన్ని మరిచి పసిపిలాడిలా మారిన ఆ కన్న తండ్రి :

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేట గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన పిశానాటి లక్ష్మారెడ్డి. రాములమ్మ.వీరికి 6 మంది సంతానం.అందులో ఐదు మంది కూతుర్లు ఒక కొడుకు.కొడుకు పేరు శ్రీనివాస్ రెడ్డి పదవ తరగతి లో ఫెయిల్ అయ్యాడు. తండ్రికి వ్యవసాయ పనులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు కాని అనుకోకుండా 19 సంవత్సరాల వయస్సులో శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయాడు.ఈ సంఘటన 23 సంవత్సరాల క్రితం జరిగింది.వెతికి వెతికి తల్లిదండ్రులు అలసిపోయారు.శ్రీనివాస్ రెడ్డిని నేనే అని వృద్ధ దంపతులను నమ్మించి డబ్బులు ఆస్తి భూమిని దక్కించుకోవాలని ఆలోచనతో లక్ష్మారెడ్డి బంధువైన బండ రావిరాల చెందిన చింతల మోహనరెడ్డికి పోచంపల్లి మండలంలోని పెద్ద గూడెం గ్రామానికి చెందిన పూజారి పాకిరు మోహన్ రెడ్డి పరిచయం పెంచుకొని ఈ మాస్టర్ ప్లాన్ అమలు చేశారు.లక్ష్మారెడ్డికి సంబంధించిన వివరాలు మొత్తం రేవల్లి యాదయ్య తండ్రి స్వామి.చంద్ర నగర్ నకిరేకల్ ఎస్సీ జంగాలు కులము శ్రీనివాస్ రెడ్డిగా నటించాలని వ్యక్తికి రామ్ రెడ్డి వివరించారు.లక్ష్మారెడ్డి కూతుర్లు అల్లుళ్ల బంధువుల వివరాలు తెలియజేయడంతో ఈ యాదయ్య.వృద్ధ దంపతులను నమ్మించి చెరువుగట్టు నార్కట్ పల్లి గుడికి రమ్మని చెప్పడంతో దంపతులతో పాటూ వదిన కొడుకు రామ్ రెడ్డి,పూజారి ఫకీరు రామ్ రెడ్డి కూడా అక్కడికి వెళ్ళారు.ఆ తర్వాత చెట్ల పసరు పోయడం వల్ల నా కొడుకే అని లక్ష్మ రెడ్డి నమ్మాడు. అలాగే మీ కొడుకు దీక్షలో ఉన్నాడని నమ్మించి నలభై లక్షలకు ఫకీర్ రెడ్డి స్కెచ్ వేశాడు.అదేవిధంగా ప్రస్తుతం కూతురికి ఆరోగ్యం బాగా లేదని చెప్పడంతో లక్ష రూపాయలు ఇవ్వాలంటూ కోరాడు.యాదయ్య వ్యవహారశైలి పై అనుమానం రావడంతో పెద్దల సమక్షంలో తన బావమరిది వయసు విషయంలో అనుమానం ఉండడం వలన డిఎన్ఏ పరీక్ష ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని అల్లుళ్ళు, కూతుర్లు తెలిపారు.

విషయం చెయిజారుతుంది అన్న విషయం గమనించిదమూఠ సభ్యులు లక్ష్మారెడ్డికి ఫోనెచేసి భయభ్రాంతులకు గురిచేసినారు.రోజురోజుకి సమస్య పెద్దది అవడంతో పాలుపోని లక్ష్మారెడ్డి ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయం తెలిపారు.దీంతో రంగంలోకి దిగిన ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేస్తున్న సమయంలో నమ్మలేని నిజాలు వెలుగు చూశాయి. ఇబ్రహీంపట్నం ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రేపల్లి యాదయ్య వయసు 59సం ఇతను ఒక ప్రణాళిక ప్రకారం లక్ష్మారెడ్డి ఆస్తిని కొల్లకొట్టాలనే ఆలోచనతో ప్లాన్ అమలు చేశారన్నారు.ఈ కేసులో ఓ నిందితుడు పరారీ లో ఉన్నాడని త్వరలో అతన్ని పట్టుకుని రిమండ్ చేస్తామని పోలీసులు తెలిపారు .

# వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి డాక్టర్ డోలి సత్యనారాయణ గంగపుత్ర పేరును ప్రకటించాలి

## – టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర

**హనుమకొండ(ప్రశ్న న్యూస్)** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ జన సమితి (టీజేఎస్) అభ్యర్థిగా ఉన్నత విద్యావంతుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు, వెనుకబడిన సంప్రదాయ మత్స్యకార గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ డోలి సత్యనారాయణ గంగపుత్ర పేరును ప్రకటించాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పత్రిక ప్రకటనలో కోరారు.తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన డాక్టర్ డోలి సత్యనారాయణ గంగపుత్రకు ఉన్నత విద్యతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన, ప్రజా సమస్యల పట్ల నిబద్ధత ఉందని సంఘం పేర్కొంది. ముఖ్యంగా రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన సంప్రదాయ మత్స్యకార గంగపుత్ర సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అవకాశం కల్పించాలని కోరింది.టీజేఎస్ రాష్ట అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యతనిస్తూ వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి డాక్టర్ డోలి సత్యనారాయణ గంగపుత్ర పేరును పరిశీలించి అభ్యర్థిగా ప్రకటించాలని తెలంగాణ గంగపుత్ర సంఘం విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు టీజేఎస్ నాయకత్వం సానుకూలంగా స్పందించి గంగపుత్ర సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు



## నవంబర్"6"కే లాస్ట్ డే.

# పట్టభద్రులు బీ రెడీ:ముద్దం



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్,రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బిఆర్ఎస్ శ్రేణులు,నాయకులు కూకట్పల్లి బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని పట్టభద్రులను అవగాహన కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఆలోచనతో స్థానిక మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ కాలనీలు,బస్తిలు ఎక్కడ గ్రాడ్యుయేట్స్ ఉన్నారో వారి వద్ద చేరి కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు చేసిన మోసాలు వివరిస్తూ, గతంలో కేసిఆర్ సర్కార్ చేసిన గొప్ప తనం గురించి వివరిస్తూ ఓటు నమోదు చేసుకొని పెద్దల సభకు నిలదీసే నాయకున్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే డివిజన్ లో బిఆర్ఎస్ శ్రేణులతో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోనే విధంగా చూడాలన్నారు.గత ఎన్నికలలో ఇదే జోరుతో ముందుకు పోయాము కాబట్టి విజయం సొంతం అయ్యిందన్నారు.డిప్లమాగ్రాడ్యుయేట్లకి సర్కార్ చేస్తున్న మోసం పాలిటెక్నిక్ విద్యార్థులను లేబర్ గా మార్చే కుట్రలో భాగంగా జీవో 97 తీసుకొచ్చిన విషయం వారికి గుర్తు చేయాలన్నారు.ఫ్యూచర్ సిటీలో లేబర్ గా పనిచేసేందుకు పాలిటెక్నిక్ విద్యార్థులను వాడుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని ముద్దం ఆవేదన వ్యక్తంచేశారు.నవంబర్ 6న గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు ఆఖరి తేదీ కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరి గ్రాడ్యుయేట్ కి విజ్ఞప్తి చేశారు.ప్రతి ఓటరుకు చేరువై వారితో ఓటు హక్కు నమోదు చేయిస్తే మనకు అనుకూలంగా ఉంటుందని డివిజన్ బిఆర్ఎస్ శ్రేణులతో పార్టీ కార్యాలయంలో చర్చించారు.బిఆర్ఎస్ నాయకుడు ప్రతిరోజు 40 అప్లికేషన్ల వరకు నింపేలా ప్రణాళికను రూపొందించాలని ఆయన అన్నారు.ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అప్పుడే "హస్తం"గతి తప్పి మనకి విజయం సొంతం అవుతుందని గుర్తు చేశారు.దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పాటించి దరఖాస్తు ఫారం నింపాలి,ఒకవేళ అభ్యర్థులు వారేఆన్ లైన్లో పూర్తి చేసుకుంటాము అని అంటే తర్వాత వారి వద్ద నుంచి రసీదు తీసుకుంటే మనం మిగతా ప్రక్రియ పూర్తి చేయొచ్చు అని ముద్దం నర్సింహా యాదవ్ పేర్కొన్నారు.గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదుకు ఓటర్ లిస్టుతో ఎలాంటి సంబంధం లేదని వారు కూడా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందన్న ముద్దం.. డిప్లమా,డిగ్రీ చదువుకున్న ప్రతి ఒక్కరూ ఎక్కడైనా ఓటు నమోదు చేసుకొని, ఓటు వేసే అవకాశం ఉందిఅర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలని ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు.అలాగే నిన్న శుక్రవారం ఉదయం బోయిన్ పల్లి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియలో అర్హులైన గ్రాడ్యుయేట్ విద్యార్థులు,యువత ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఓల్డ్ బోయిన్ పల్లి ప్రాంతంలో గ్రాడ్యుయేట్లను ఆయన కోరారు.అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముద్దం నర్సింహ యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన వైపు వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున జనసేన పార్టీ వైపు క్యూ కడుతున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో పాటు, ఏపీ సర్కార్లో ఉప ముఖ్యమంత్రిగా ఆయన పెంచుకున్న రాజకీయ గ్రాఫ్ ఈ చేరికలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రతిపక్షం నుంచి నాయకులు వరుసగా వచ్చి చేరుతుండటం వల్ల జనసేనకు రాజకీయంగా కొత్త ఊపు, ఒక బలమైన పొలిటికల్ మూమెంటం లభిస్తోంది. అయితే, ఈ చేరికలు పార్టీని నిజంగా ఒక ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా మారుస్తాయా? లేక కేవలం తాత్కాలిక హడావుడికే పరిమితమవుతాయా ? ఏ రాజకీయ పార్టీకైనా నాయకులు, కేడర్ వరుసగా రావడం అనేది ప్రజాక్షేత్రంలో సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. వైఎస్సార్‌సీపీ నుంచి నేతలు జనసేనలోకి రావడం ద్వారా రాష్ట్రంలో భవిష్యత్తు జనసేనదే అన్న అభిప్రాయం ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ బలపడుతోంది. ఇది పార్టీ ఇమేజ్‌ను పెంచడానికి, ద్వితీయ శ్రేణి కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి ఉపయోగపడుతుంది. ఈ చేరికల వల్ల రాజకీయ మూమెంటం వచ్చినప్పటికీ, జనసేన ప్రస్తుతం టిడిపి–జనసేన–బీజేపీ అధికార కూటమి లో భాగంగా ఉంది. ఒక పార్టీ అధికార కూటమిలో ఉంటూ సొంతంగా ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని, స్వతంత్ర ప్రత్యామ్నాయ శక్తిని ఆక్రమించడం సాధ్యం కాదు. ప్రభుత్వం సాధించే విజయాల్లో భాగస్వామ్యంతో పాటు, ప్రభుత్వ వ్యతిరేకత వస్తే దాని ప్రభావం కూడా జనసేనపై పడుతుంది. అందువల్ల ఎంతమంది నాయకులు చేరినా, కూటమి పరిధిలోనే పవన్ కళ్యాణ్ రాజకీయం చేయాల్సి ఉంటుంది.ఎంతమంది వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు , దిగ్గజ నాయకులు జనసేన కండువా కప్పుకున్నా, ఎన్నికల సమయానికి వచ్చేసరికి పొత్తుల ధర్మం ప్రధాన అడ్డంకిగా మారుతుంది. కూటమి ఒప్పందం ప్రకారం జనసేనకు పరిమిత సంఖ్యలోనే స్థానాలు దక్కే అవకాశం ఉంటుంది. దాంతో, కొత్తగా చేరిన సీనియర్ నేతలందరికీ టికెట్లు కేటాయించడం పవన్ కళ్యాణ్‌కు కత్తిమీద సాములా మారుతుంది. టికెట్లు దక్కని నాయకులు మళ్లీ అసంతృప్తికి గురై పార్టీ మారే లేదా తిరుగుబాటు చేసే ప్రమాదం కూడా ఉంది. జనసేనలో ఈ చేరికలు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలంటే, ఆ పార్టీ భవిష్యత్తులో కూటమి నుంచి బయటకు వచ్చి ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి కి ఎదగాలి. కూటమికి అతీతంగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠం లక్ష్యంగా జనసేన ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా మారినప్పుడే ఈ నేతల చేరికలు నిజమైన సీట్లుగా, ఓట్లుగా మారతాయి. లేకపోతే, టీడీపీ కేటాయించే కొన్ని సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.మరో కీలకమైన అంశం ఏంటంటే.. మొదటి నుంచీ పవన్ కళ్యాణ్ వెంట ఉండి, పార్టీ కోసం కష్టపడిన జనసైనికులు , సిద్ధాంతపరమైన కార్యకర్తలు ఉన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నుంచి వస్తున్న నాయకులు ఎక్కువ భాగం అధికారంలో ఉండగా ప్రయోజనాలు పొందినవారే. అకస్మాత్తుగా పార్టీలోకి వచ్చిన కొత్త నాయకులకు ప్రాధాన్యత ఇస్తే, పాత కేడర్‌లో అసంతృప్తి రగిలే అవకాశం ఉంది. ఈ పాత–కొత్త నేతల మధ్య సమన్వయం కుదర్చడం జనసేన అధిష్టానానికి పెద్ద పరీక్షగా మారనుంది వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి వరుస చేరికలు పార్టీ వృద్ధికి మంచి సంకేతమే అయినా, అది కేవలం పొలిటికల్ మూమెంటం వరకే పరిమితమవుతుంది. పవన్ కళ్యాణ్ తన పొత్తుల వ్యూహాన్ని, భవిష్యత్ రాజకీయ ప్రణాళికను స్పష్టంగా రూ పొందించుకుంటే తప్ప, ఈ నాయకుల బలం సీట్ల రూపంలోకి మారడం కష్టం. కూటమి పరిమితులను దాటుకొని జనసేన తన సొంత జెండాపై ఏ మేర అధికారాన్ని డిమాండ్ చేయగలదనే దానిపైనే ఈ చేరికల అసలు ఫలితం ఆధారపడి ఉంటుంది.

# మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**కురవి** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కురవి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాలగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, శాంతి, సమానత్వం వంటి విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్ర కుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, బానోత్ తుకారాం నాయక్, మండల కార్యదర్శి శ్యామల శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షులు దడిగల శరత్, కురవి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు దైద భద్రయ్య, దడిగల వీరేందర్, జిల్లా యూత్ నాయకులు గార్లపాటి భరద్వాజ్, కురవి బీఎల్ఏ నాగరాజ్, రేకుల తండా గ్రామ పార్టీ అధ్యక్షులు బానోతు లాలా నాయక్, కురవి మండల నాయకులు బానోతు లక్ష్మణ్ నాయక్, మిరియాల లచ్చయ్య, తరాల నాగరాజ్, బత్తిని వీరభద్రం, కర్నాటి నాగన్న తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలి

**- పోస్ట్‌కార్డులతో ప్రభుత్వానికి జర్నలిస్టుల విజ్ఞప్తి**

**- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వైద్య భద్రత కల్పించాలి**




**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం వెంటనే క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేసి, వారికి మెరుగైన వైద్య భద్రత కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టి యు డబ్ల్యు జే హెచ్-143), తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్ ( టి ఈ ఎం జె యు) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ పిలుపు మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్లలో పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం ఎదుట జర్నలిస్టులకు హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని తెలిపారు.

# ఇబ్రహీంపట్నంలో ఘనంగా జయంతి వేడుకలు

**- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్, భాజపా నేతలు**



**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రింగ్ సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, భాజపా సీనియర్ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి, నూతులపాటి బాల కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.సత్యం, అహింస మార్గాల్లో పయనించి దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. గాంధీజీ చూపిన శాంతి, అహింసా మార్గాలు నేటి సమాజానికి, ముఖ్యంగా యువతకు ఆదర్శనీయమని పేర్కొన్నారు.

దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ బాపూజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాజపా నాయకులు మారాసు కృష్ణమోహన్, నక్క రమేష్, పులి దాసు, కౌన్సిలర్ గోపాలరావు, ధరణికోట విజయలక్ష్మి, కూనల యుగంధర్, కరుకుమల్లి సత్యవతి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు, స్థానిక ప్రముఖులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మహాత్ముడికి ఘనంగా నివాళులర్పించారు.

# ఏటూరునాగారంలో మాదకద్రవ్యాల ముఠా గుట్టురట్టు

**- నలుగురు నిందితుల అరెస్ట్.. గంజాయి స్వాధీనం**

**- సీఐ ప్రకాష్, ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక దాడులు**

**- మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్న సూత్రధారుల కోసం ముమ్మర దర్యాప్తు**



**ఏటూరునాగారం (ప్రశ్న న్యూస్)** ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు ఏటూరునాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, ఎస్ ఐ మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## విచారణలో వెలుగులోకి వచ్చిన కీలక విషయాలు

పోలీసులు తొలుత ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, మరో వ్యక్తి పాత్ర వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. దీంతో మొత్తం నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రకాష్ వెల్లడించారు.అరెస్టయిన వారిలో ఏ1 జగదీష్, ఏ2 రామ్ చరణ్ తేజ్, ఏ3 ఆకుల వంశీ (28), ఏ4 వరప్రసాద్ ఉన్నారు. ఆకుల వంశీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సీతానగరం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. వరప్రసాద్ పెట్రోలు బంకు నిర్వాహకుడిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## సరఫరా మూలాలపై ఆరా

ప్రాథమిక విచారణలో ఏ1 జగదీష్, ఏ3 ఆకుల వంశీ మాదకద్రవ్యాలను కొనుగోలు చేసినట్లు, ఏ3 ఆకుల వంశీకి ఏ4 వరప్రసాద్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ అక్రమ దందాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? మాదకద్రవ్యాలు ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఎవరికి సరఫరా చేస్తున్నారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయిని స్వాధీన జాబితాలో నమోదు చేసి, మాదకద్రవ్యాలు, మానసిక ప్రభావిత పదార్థాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.
అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తాం మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రకాష్, ఎస్ఐ మహేష్ హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతుండటంతో, ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# మంత్రి సీతక్క చొరవతో ఏటూరునాగారంలో కరెంట్ కష్టాలకు చెక్

**- 15వ వార్డులో నూతన 100 హెచ్ పి ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం**

**- ప్రజా సమస్య పరిష్కరించిన వార్డు సభ్యుడు నాగవత్ కిరణ్ కు అభినందనల వెల్లువ**



**ఏటూరునాగారం (ప్రశ్న న్యూస్)**(మంత్రి సీతక్క ఆదేశాలతో, డిసిసి అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఏటూరునాగారం మండల కేంద్రంలో ప్రజా సమస్యకు పరిష్కారం లభించింది.ఏటూరునాగారం 15వ వార్డు క్రాస్ రోడ్డు పరిధిలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు కరెంట్ సరఫరా సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని 15వ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగవత్ కిరణ్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీంతో స్పందించిన అధికారులు 100 హెచ్ పి సామర్థ్యంతో నూతన డి టి ఆర్ తో పాటు 8 నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజల చిరకాల కరెంట్ సమస్య తీరినట్లయింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ప్రజల కష్టాలను గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 15వ వార్డు సభ్యుడు నాగవత్ కిరణ్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు అభినందించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్న కిరణ్ మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

# ఆపదలో ఆపద్బాంధవులు.. మన బెస్తపల్లె గంగపుత్రులు

**- నీటి ప్రమాదాల్లో ప్రాణాలకు తెగించి రక్షణ చర్యలు**

**- నదులు, చెరువులు, వాగుల ముందుండే గజ ఈతగాళ్లు**

**- సింగరేణి గంగపుత్ర వేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం**




**గోదావరిఖని (ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని గోదావరి తీరం సమీపంలో సింగరేణి గంగపుత్ర ఆత్మీయ సంగమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ గంగపుత్ర సంఘం సహకారం అందించింది. గంగపుత్ర సంఘం సీనియర్ నాయకుడు బంగారి రాజయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బెస్తపల్లి సర్పంచ్ అరిపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. నీటితో అనుబంధం, ఈతలో నైపుణ్యం, ఆపదలో సేవాభావం లాంటివే గంగపుత్రుల ప్రత్యేకత అన్నారు. నదులు, చెరువులు, కుంటలు, వాగుల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతూ గంగపుత్రులు సమాజానికి అండగా నిలుస్తున్నారని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. నీటి ప్రమాదాల్లో గజ ఈతగాళ్లుగా వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపీ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ చేతి ధర్మయ్య , ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ పూర్వ ప్రిన్సిపల్, హైకోర్టు అడ్వకేట్ పాక సజన్ కుమార్, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ సతీష్ తదితరులు హాజరయ్యారు.

**- ప్రమాద సమాచారం వస్తే చాలు వాలిపోతాం ;**

నీటితో తరతరాలుగా తమకు అనుబంధం ఉందన్నారు. నదులు, చెరువులు, కుంటలు, వాగుల్లో ఈతలో మంచి ప్రావీణ్యం కలిగిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని ఆయన తెలిపారు. చెరువులు, నదులు, కుంటలు, వాగుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ అధికారులు కూడా మా సహకారం కోరతారని స్పష్టం చేశారు.

# పంటను కాపాడబోయి ప్రాణాలు తీసుకున్న కౌలుకు రైతులు

**- వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్‌కు గురై భార్యాభర్తలు మృతి**



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** ఆరుగాలం శ్రమించి పండించిన పంట అడవిపందుల బారి నుండి కాపాడుకోవడం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె ఆ కౌలు రైతుల ప్రాణాలు తీసింది. వివరాల్లోకి వెళితే గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన గంట దేవయ్య(65), అతని భార్య గంట లక్ష్మి (58) గంభీరావుపేట గ్రామ పరిధిలో పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ప్రతిరోజు తమ పంటను అడవి జంతువుల బారి నుండి కాపాడుకునేందుకు పొలం వద్దకు వెళ్లి పంటను పరిశీలిస్తూ ఉండగా ప్రమాదవశత్తు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మరణించారని గంభీరావుపేట ఎస్సై సిహెచ్ శ్రీకాంత్ తెలిపారు. పంటను అడవి జంతువుల నుండి రక్షించేందుకు పొలం వద్ద ఉన్న స్టార్టర్ డబ్బా నుండి విద్యుత్ వైరు తీసి, కరెంట్ షాక్ ద్వారా అడవి జంతువులు పొలంలోకి ప్రవేశించకుండా విద్యుత్తు వైర్లు ఏర్పాటు చేశాడని గురువారం సాయంత్రం గంట దేవయ్య, అతని భార్య గంట లక్ష్మి ఇద్దరు తమ పొలం వద్దకు వెళ్లారని అనంతరం శుక్రవారం రోజున గొల్ల నిశాంత్ అనే వ్యక్తి పొలం వైపు వెళ్లగా, వారి పొలం వద్ద ఇద్దరూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉండటాన్ని గమనించి, వారి కుమార్తె గంధ్యాడపు భాగ్యలక్ష్మికి సమాచారం అందించాడు.మృతుల కుమార్తె గంధ్యాడపు భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె తల్లితండ్రులు ఇద్దరూ తమ పంటను అడవి జంతువుల నుండి రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపింది. వారి మరణం పై ఎవ్వరిపై ఎలాంటి అనుమానము లేదని దరఖాస్తు ఇచ్చినది. ఈ ఘటనపై గంభీరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

**కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి** విద్యుత్ షాక్ తో మరణించిన భార్య భర్తలు గంట దేవయ్య, గంట లక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, మృతికి మౌనం పాటించి ప్రగాఢ సంతాపం తెలిపిన ఎల్లారెడ్డిపేట మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు ప్రగాఢ సంతాపం తెలిపారు. కౌలు రైతుల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్**



**పెద్దపల్లి (ప్రశ్న న్యూస్)** జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన పథకాలను వెంటనే అమలు చేయాలని పెద్దపల్లి జిల్లా మంథని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్ డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం మంథనిలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంకరి కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, జర్నలిస్టు కుటుంబాలకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, మంథని ప్రెస్ క్లబ్ శాశ్వత భవనానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు బస్సు పాస్ పాస్ సౌకర్యం తో పాటు టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని, సీనియర్ సిటిజన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జర్నలిస్ట్ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ కు మరో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంథని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, కోశాధికారి తగరం రాజు, సహాయ కార్యదర్శి గంధం అంజి బాబు, సీనియర్ జర్నలిస్టు కొమురోజు చంద్రమోహన్, లక్కాకుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల హక్కులను కాపాడాలి

**- ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌పై విధిస్తున్న ఆంక్షలను వెంటనే తొలగించాలి**




ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ఉప సర్పంచ్ లకు గౌరవంతో పాటు గౌరవ వేతనం ఇవ్వాలి.ఉప సర్పంచుల హక్కులను కాపాడాలని చెక్ పవర్ యధావిధిగా కొనసాగించాలని ఎల్లారెడ్డిపేట మండలం ఉప సర్పంచుల పోరం అధ్యక్షులు మందాటి రాము యాదవ్ అన్నారు. ఉప సర్పంచ్ లు రాజ్యాంగ బద్ధంగా బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నుకోబడిన వారు కాబట్టి ఉప సర్పంచ్ లకు గౌరవం తో పాటు గౌరవ వేతనం ఇవ్వాలని, నిధులు దుర్వినియోగం కాకుండా ఉండాలంటే ఉప సర్పంచ్ లకు జాయింట్ చెక్ పవర్ తో పాటు మండల సర్వ సభ్య సమావేశానికి ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం ను ఆయన డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్‌ల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని మందాటి రాము యాదవ్ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు



**శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్)** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని తేరు వీధిలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మాగాంధీ సత్యాగ్రహం, అహింసా మార్గాలను ఎంచుకోవడం చారిత్రాత్మకమైందన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గాంధీజీ ఆశయాలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ ఎస్.కె. అజారుద్దీన్, పద్మావతి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు.



**శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్ )** శ్రీకాళహస్తి జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపికృష్ణ టెక్స్టైల్స్ రమేష్ నేతృత్వంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చేసిన సేవలను కొనియాడారు.గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విదేశీ వస్తువులను విడనాడి దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పెళ్లి మండపం వద్ద గోపికృష్ణ టెక్స్టైల్స్ రమేష్, మిత్రబృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు.సేవ, త్యాగం, అహింస వంటి గాంధీజీ ఆశయాలను ఆచరణలో చూపించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, మురళి,బాబు, ప్రసాద్, రమణ, భాస్కర్, మధు, వెంకటముని, తదితరులు పాల్గొన్నారు.

# ‘సిగ్మా’ – మూవీ రివ్యూ!

హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ హీరోగా ఎంట్రీ ఇస్తాడని ఆయన అభిమానులు భావిస్తే, అందుకు భిన్నంగా ఆయన మెగాఫోన్ పట్టుకున్నాడు. సందీప్ కిషన్ హీరోగా ఒక సినిమాను రూపొందించాడు .. ఆ సినిమా పేరే ‘సిగ్మా’. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది.గురు (సందీప్ కిషన్) తల్లిదండ్రులను కోల్పోయిన ఓ అనాథ. తనని చేరదీసిన డాక్టర్ ‘నీల్’ (రాజు సుందరం)తో అతను ఎంతో సన్నిహితంగా ఉంటాడు. తండ్రి చేసిన అప్పులు అతనిని సతమతం చేస్తుంటాయి. అందుకు అవసరమైన డబ్బులను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక తికమక పడుతుంటాడు. ఆ ఇంట్లో తల్లికి సంబంధించిన ఒక పాత లైబ్రరీ ఉంటుంది. ఆమెకి గుర్తుగా అతను ఆ లైబ్రరీని కాపాడుకుంటూ వస్తుంటాడు. ఆ లైబ్రరీని ఉపయోగించుకుని ‘ఆడియో బుక్ ఛానల్’ ను ఏర్పాటు చేయాలనే ఒక ఆలోచన చేస్తాడు. ఆడియో బుక్ ఛానల్ కి లేడీ వాయిస్ అయితే బాగుంటుందనే ఉద్దేశంతో, ఆర్జేగా పనిచేస్తున్న ‘సామ్’ (ఫరియా అబ్దుల్లా)ను ‘గురు’ సంప్రదిస్తాడు. అలా వాళ్లిద్దరి మధ్య పరిచయం మొదలవుతుంది. అప్పు తీర్చకపోతే ఆ ఇంటిని సొంతం చేసుకుంటామని అప్పులవాళ్లు ‘గురు’ను హెచ్చరిస్తారు. దాంతో ఎలాగైనా సాధ్యమైనంత త్వరగా పెద్ద మొత్తంలో సంపాదించాలని నిర్ణయించుకుంటాడు. క్లబ్ లో జూదమాడి ‘విన్సెంట్’తో గెంటివేయబడతాడు. వీరయ్య రెడ్డి (సంపత్ రాజ్) ఏనుగు దంతాలు .. పులిచర్మాలు అక్రమ రవాణా చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తూ ఉంటాడు. వెయ్యికోట్ల రూపాయలను అతను ఒక ఒక ఐరన్ బాక్స్ లో పెట్టేసి .. ఆ బాక్స్ కి సంబంధించిన ‘కీ’ ప్లస్ ‘పెన్ డ్రైవ్’ ని తన దగ్గర పెట్టుకుంటాడు. అనుకోకుండా ఆ ‘కీ’ ‘గురు’ ఇంటికి చేరుతుంది. ఆ ‘కీ’ కోసం ఒక వైపున వీరయ్యరెడ్డి .. మరో వైపున విన్సెంట్ మనుషులు వెతకడం మొదలు పెడతారు. చివరికి అది ఎవరికి చిక్కుతుంది? ఆ వెయ్యికోట్ల సంపద ఎవరికి దక్కుతుంది? అనేదే కథ. ‘గురు’ తన తండ్రి చేసిన అప్పు తీర్చడం కోసం, తల్లికి ఇష్టమైన ఇంటిని వదులుకోవలసి వస్తుంది. అది ఎంతమాత్రం ఇష్టం లేని గురు, ఆ మొత్తాన్ని సాధించి తీరాలనే పట్టుదల కలుగుతుంది. అప్పుడే అతనికి వెయ్యి కోట్లకు సంబంధించిన ఒక టాస్క్ ఎదురవుతుంది. ఆ డబ్బును దక్కించుకోవడం కోసం అతను ఏం చేస్తాడు? ఎలాంటి సవాళ్లను దాటుకుంటూ వెళతాడు? అనే అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. గురు అతని స్నేహితుడు .. లవర్ కలిసి ఒక గ్యాంగ్ గా .. వీరయ్య రెడ్డి గ్యాంగ్ .. విన్సెంట్ గ్యాంగ్ .. తెరపై కనిపిస్తాయి. కథ మొత్తం



ఈ మూడు గ్యాంగుల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఈ మూడు గ్యాంగులు వెతుకులాడే ఒక ‘కీ’ చుట్టూ పరిగెడుతూ ఉంటుంది. దర్శకుడు తాయారు చేసుకున్న కథ ప్రకారం ఈ కథలో మదర్ సెంటిమెంట్ ను అనుకున్నాడు. అలాగే హీరో పాత్ర చుట్టూ ఆర్థిక ఇబ్బందులను క్రియేట్ చేసి ఆడియన్స్ కి ఒక పెయిన్ ఉండేలా చూసుకున్నాడు. తనకి ఇప్పుడు పెద్ద మొత్తంలో డబ్బు అవసరం అనే ఒక పరిస్థితిని సృష్టించాడు. అందుకోసం హీరో రంగంలోకి దిగేలా చేశాడు. అయితే కథలోని అంశాలను ఆడియన్స్ కి ఎమోషనల్ గా కనెక్ట్ చేయలేకపోయాడు. ప్రతి అంశంలోను గాఢతను ఆవిష్కరించలేకపోయాడు. వేయ్యి కోట్ల రూపాయలకు సంబంధించిన ‘కీ’ చేతులు మారుతూ వెళ్లడం .. దాని కోసం పెట్టే పరుగులు .. ఒకరిపై ఒకరు చేసుకునే దాడులు మామూలే. ఈ నేపథ్యంలోనే కామెడీని కూడా వర్కౌట్ చేయాలని దర్శకుడు అనుకున్నాడు. కానీ ఇక్కడ కూడా మిగతా విషయాలలో జరిగిన పొరపాటే జరిగింది. ఇక పాత సినిమాల మాదిరిగా పాత ఫ్యాక్టరీకి క్లైమాక్స్ ను తరలించారు. ఇక్కడైనా కొత్తగా ఏమైనా చూపిస్తారేమోనని అనుకున్న ఆడియన్స్ కి నిరాశనే ఎదురవుతుంది. సందీప్ కిషన్ చాలా ఈజ్ తో చేశాడు. ఫరియా అబ్దుల్లా చాలా గ్లామరస్ గా మెరిసింది. ఇక సంపత్ రాజ్ విలనిజం ఆడియన్స్ కి సుపరిచితమే. అయితే ఆయన పాత్రలో పవర్ లోపించడం కనిపిస్తుంది. శివ్ పండిట్ విలనిజాన్ని కూడా తేల్చిపారేశారు. కేథరిన్ ఐటమ్ సాంగ్ కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. కృష్ణన్ వసంత్ ఫొటోగ్రఫీ .. తమన్ నేపథ్య సంగీతం ఈ కంటెంట్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లడానికి తమవంతు ప్రయత్నం చేశాయి. ప్రవీణ్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. సందీప్ కిషన్ – ఫరియా అబ్దుల్లా అనగానే, హైట్ పరంగా మంచి జోడీ అనిపిస్తుంది. కానీ తెరపై ఇద్దరి మధ్య లవ్ .. రొమాన్స్ గట్రా ఏమీ ఉండవు. తాము లవర్స్ అనే ఆలోచన వాళ్లకి లేదు .. ఆడియన్స్ కి అలాంటి అభిప్రాయం కలగనీయలేదు. లైకా ప్రొడక్షన్స్ అనగానే మనకి అర్థమైపోతుంది .. నిర్మాణ పరమైన విలువల విషయంలో రాజీ ఉండదని. అదే విషయాన్ని ఈ సినిమా మరోమారు నిరూపిస్తుంది. జేసన్ సంజయ్ ను నమ్మి గట్టిగానే ఖర్చు పెట్టారు. కోట్ల రూపాయల డబ్బు .. ఆ డబ్బును దక్కించుకోవడం కోసం చేసే ముఠాలు ప్రయత్నాలు .. హీరో వైపు నుంచి కూడా సాగే పోరాటం నేపథ్యంలో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. ఎమోషన్స్ తో ముడిపెడుతూ భారీ యాక్షన్ దృశ్యాలతో ఆశ్చర్యపరిచిన సినిమాలు ఉన్నాయి. ఆ సినిమాలకి ఏ మాత్రం భిన్నంగా లేకుండా రొటీన్ గా తీసిన సినిమా ఇది. జేసన్ సంజయ్ దర్శకత్వం వహించిన తొలి సినిమా అనే ప్రత్యేకత తప్ప, మరే విధంగాను ప్రభావితం చేయలేకపోయిన సినిమా ఇది.

## “డోంట్ ట్రబుల్ ది ట్రబుల్”

# మూవీ రివ్యూ



ఫాంటసీ కథతో వచ్చిన సినిమాలు ఎప్పుడూ ఇంట్రెస్టింగ్‌గానే అనిపిస్తాయి. ఇలాంటి సినిమా సక్సెస్ సాధిస్తే బాక్సాఫీస్ వద్ద వసూళ్లకు కూడా కొదువ ఉండదు. ఇలాంటి ఓ ఫాంటసీ కథాంశంతో రూపొందిన చిత్రమే ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’. ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో కార్తికేయ నిర్మాతగా తెరకెక్కిన ఈ చిత్రంలో మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ కథానాయకుడిగా నటించాడు. ఈసినిమాపై విడుదలకు ముందే హీరో మహేష్ బాబు, ఎన్టీఆర్‌లు ప్రశంసలు కురిపించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఇక ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ చిత్రం కథాంశం ఏమిటి? ఈ చిత్రం ఎలా ఉంది? ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను అందుకుందా? తెలుసుకుందాం. సూరి (ఫహద్ ఫాజిల్) అనాథ. స్నేహితుడు (వెంకటేష్ కాకునూరు)తో కలిసి ఉంటాడు. డబ్బు కోసం అంబులెన్స్‌ను నడుపుతుంటాడు. ఎలాగైనా డబ్బు సంపాందించి జీవితంలో సెటిల్ కావాలని ప్రయత్నిస్తుంటాడు. అందులో భాగంగానే ఓ గొర్రె పొట్టేల్ పోటీలో అస్లాం భాయ్ పొట్టేల్‌ను మోసం చేసి ఓడించి చిక్కుల్లో ఇరుక్కొంటాడు. అస్లాం భాయ్ గ్యాంగ్ సూరి నుంచి 25 లక్షలు డిమాండ్ చేస్తుంది. లేకపోతే నీ ప్రాణాలకే ప్రమాదం అని హెచ్చరించండంతో దాంతో డబ్బు ఎలాగైనా అస్లాం భాయ్ గ్యాంగ్‌కు ఇవ్వాలని ప్రయత్నిస్తుంటాడు. ఇక రిచ్ ఫ్యామిలీకి చెందిన చిన్న పిల్లలని ఎవరైనా కిడ్నాప్ చేసి వచ్చిన డబ్బుల్లో రూ.25 లక్షలు అస్లాం గ్యాంగ్‌కి ఇచ్చేసి, మిగిలిన డబ్బులతో దుబాయ్ వెళ్లిపోవాలని ప్లాన్ చేసుకుంటాడు. అలాంటి సమయంలోనే సంపన్న కుటుంబానికి చెందిన చిన్నారి దివ్య (సారా పాలేకర్) తన అమ్మనాన్నలను తానే మాయం చేశాననీ, వాళ్లను కనిపించేలా చేయాలని అడిగిన దివ్యను, కుక్క స్నూపీని సూరి ఓ ప్లాన్‌తో తన వెంట తీసుకెళ్లి కిడ్నాప్ పథకం మొదలుపెడతాడు. ఇక సూరి పథకం ఫలించిందా? దివ్య తల్లిదండ్రులు ఎవరు? తన అమ్మనాన్నలను తానే మాయం చేశానని దివ్య ఎందుకు చెబుతుంది? చివరికి ఏం జరిగింది? అమ్మనాన్నల్ని కలుసుకోవాలన్న దివ్య కోరికను సూరి నెరవేర్చాడా? అనేది చిత్ర కథ. ఇలాంటి ఇంట్రెస్టింగ్ ఫాంటసీ కథాంశంతో చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఇలాంటి కథాంశాలను ప్రేక్షకాదరణ పొందేలా డీల్ చేయడం.. నిర్మించడం రెండూ కష్టమే. అయితే ఒకవేళ ఇలాంటి సినిమా ప్రేక్షకులకు నచ్చిదంటే దాని రిజల్ట్ కూడా అనూహ్యంగా ఉంటుంది. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ కూడా ప్రేక్షకులకు అలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి ఓ ఫాంటసీ కథతో తెరకెక్కింది. అయితే కథాంశం, కాన్సెప్ట్ కొత్తగా ఉన్నా.. ఈ ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌ను ఎంచుకున్నప్పుడు దానికి తగ్గ స్క్రీన్‌ప్లే, ఎమోషన్.. అన్నింటికి మించి ఆ కథను ఎగ్జిక్యూట్ చేసే ప్రతిభ కలిగి ఉండాలి.. ఈ సినిమా విషయంలో కాన్సెప్ట్ ఓకే.. రచనా పరంగా స్ట్రాంగ్‌గా ఉంటే బెటర్ అవుట్‌పుట్ వచ్చే స్కోప్ ఉండేది. బట్ కథను అత్యంత బోరింగ్‌గా చెప్పడమే ఈ సినిమాకు ఉన్న అతిపెద్ద మైనస్.స్లో నేరేషన్.. వీక్ సీన్స్.. వల్ల ఎక్కడా కూడా సినిమా ఇంట్రెస్టింగ్‌గా అనిపించదు సరికదా.. ప్రేక్షకుడి ఓపికకు పరీక్ష పెట్టేలా ఉంది.ఫస్టాఫ్ సో..సో..గా సాగిన ఈ సినిమా సెకండాఫ్‌లో మరింత బోరింగ్‌గా, ట్రాక్ తప్పిన సినిమాలా అనిపించింది. సినిమా మొదలైన 20 నిమిషాల్లోనే ఈ సినిమా ఎటు వెళుతుంది? ఏమీ చూపించబోతున్నారు అనే అసహనంతోనే సినిమా అంతా ప్రేక్షకుడు భరించాల్సి వస్తుంది. ప్రతి సన్నివేశం సాగదీతగా.. స్లోగా నత్తనడకన సాగుతుంది. సినిమాలో హాస్యం, ఎమోషన్ ఎక్కడా కూడా వర్కవుట్ కాలేదు. సూరి, దివ్య క్యారెక్టర్‌తో ఆడియన్స్ ఎంత ప్రయత్నించినా కనెక్ట్ కాలేరు. పతాక సన్నివేశాల్లో ఎమోషనల్‌గా తెరకెక్కించే ప్రయత్నం చేసినప్పటికీ అది విఫల ప్రయత్నంలానే మిగిలిపోయింది. రచనా పరంగా ఈ సినిమా చాలా బలహీనంగా కనిపించింది. ఓ ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌కు తగ్గ స్క్రీన్‌ప్లేను, సన్నివేశాలను రచించడంలో దర్శకుడు ఇంకాస్త శ్రద్ధ పెడితే బాగుండేది. ఓవరాల్‌గా డోంట్ ట్రబుల్ ది ట్రబుల్.. ట్రబుల్స్‌తోనే సాగింది జర్నీ..! సూరి పాత్రలో ఫహద్ ఫాజిల్ ఎందుకో సెట్ కాలేదని అనిపిస్తుంది. ఆయన నటనకు వంక పెట్టే స్కోప్ లేకపోయినా ఆయన పాత్ర చిత్రణలోనే లోపం కనిపిస్తుంది.? అసలు ఫహాద్ ఈసినిమాను ఎలా ఒప్పుకున్నాడు అనే ఆశ్చర్యం.. అతను ఈ సినిమా చేయాల్సినంత కంటెంట్ ఇందులో ఏముంది అనే సందేహం సినిమా చూసిన ప్రతి ఒక్కరిలో కలుగుతుంది.తొలిసారిగా ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ లాంటి గొప్ప నటుడి నటన కూడా ఎంతో సాధారణ స్థాయిలో కనిపించింది. దివ్యగా సారా పలేకర్ చాలా క్యూట్‌గా ఉంది.. స్క్రీన్ మీద ముద్దుగా, అమాయకంగా నటించింది.. కాలభైరవ సంగీతం ఫర్వాలేదనిపించింది. ఎడిటింగ్ మరింత షార్ప్‌గా ఉండాలి. నిర్మాణ విలువలు కనిపించాయి. ఓవరాల్‌గా ఈ ఫాంటసీ కథ బోరింగ్ అండ్ సాగదీత సన్నివేశాలతో ప్రేక్షకుల ఓపికకు పరీక్ష పెట్టేలా..ట్రబుల్స్‌తోనే సాగిన విఫల ప్రయాణంలా అనిపిస్తుంది.

## ‘గీతాంజలి’ రీరిలీజ్ అప్పుడే..



తెలుగు సినీప్రేమకావ్యాల్లో మణిరత్నం ‘గీతాంజలి’ది ఓ ప్రత్యేక స్థానం. విడుదలై దశాబ్దాలు గడుస్తున్నా.. నేటికీ ‘గీతాంజలి’ జనహృదయాల్లో స్థిరంగా నిలిచేవుంది. 1989లో విడుదలైన ఈ సినిమా అక్కినేని నాగార్జున సినీ జీవితానికే మేలి మలుపు. మణిరత్నం దర్శకత్వ ప్రతిభ, ఇళయరాజా సంగీతం, పీసీ శ్రీరామ్ ఛాయాగ్రహణం ఈ సినిమాను ఇండియన్ క్లాసిక్‌గా నిలబెట్టాయి. ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో.. ‘గీతాంజలి’ కూడా 4కే వెర్షన్‌లో నవంబర్ 13న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రీరిలీజ్ కానున్నది. హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలతో 37ఏండ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం నేటి యువతను సైతం తప్పకుండా ఆకట్టుకుంటుందని, 4కే వెర్షన్ తప్పకుండా కొత్త అనుభూతినిస్తుందని చిత్రాన్ని విడుదల చేస్తున్న బూర్లె శివప్రసాద్ తెలిపారు. శ్రీపద్మిని సినిమాస్ ద్వారా ఈ సినిమా విడుదల కానున్నది.

## రజనీకాంత్ ‘జైలర్ 2’ ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు..

## పండగకు ముందే రానున్న టైగర్!




సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ‘జైలర్ 2’ సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను అక్టోబర్ 5, 2026న విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన ‘జైలర్’కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో, కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే యూట్యూబ్‌లో ఈ సినిమా పేరుతో అనేక ఫ్యాన్-మేడ్, కాన్సెప్ట్ ట్రైలర్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో, అక్టోబర్ 5న రాబోయేది అఫీషియల్ ట్రైలర్ అని మేకర్స్ స్పష్టతనిచ్చారు. ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి తన ఐకానిక్ ‘టైగర్’ ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అందిస్తున్న సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ‘హుకుమ్ రీలోడెడ్’ థీమ్ సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.తారాగణం పరంగా కూడా ఈ సీక్వెల్ మరింత భారీగా ఉండనుంది. ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, తొలి భాగంలో అదరగొట్టిన మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్‌లతో పాటు ఈసారి విజయ్ సేతుపతి కూడా ప్రత్యేక అతిథి పాత్రలో మెరవనున్నారు. దీంతో ‘జైలర్ 2’పై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# బాక్సాఫీస్ వద్ద దసరా పోరు..

## ‘ది ప్యారడైజ్’ బాటలో ‘రణబాలి’!



సినిమా రంగంలో బాక్సాఫీస్ లెక్కలు ఎప్పుడూ మారుతాయన్న సంగతి తెలిసిందే. ఒక సినిమా సాధించిన విజయాలు లేదా రికార్డులు తదుపరి సినిమాలకు ఒక బెంచ్‌మార్క్‌గా మారుతుంటాయి. తాజాగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ‘ది ప్యారడైజ్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌లను నమోదు చేసి సంచలనం సృష్టించింది. ఈ సినిమాకు ఒక వైపు నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, కేవలం నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రూ. 155 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు యూనిట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నాని కెరీర్‌లో ఇటువంటి భారీ వసూళ్లు సాధించడం ఆయన స్టార్‌డమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అదే బాక్సాఫీస్ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడానికి టాలీవుడ్ మరో భారీ చిత్రంతో సిద్ధమవుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘రణబాలి’. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో, ఆ కాలంలోని కరువు పరిస్థితుల సృష్టితో పాటు ఒక సరికొత్త ఆత్మకథాత్మక లేదా మిస్టరీ అంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం అత్యంత భారీ ఎత్తున విడుదలకు ముస్తాబవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, డాక్యుమెంటరీ సిరీస్ వీడియోలు మరియు పోస్టర్లు ఈ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ‘ది ప్యారడైజ్’ సినిమాకు ఏ విధంగానైతే బలమైన పాజిటివ్ బజ్ క్రియేట్ అయిందో, ‘రణబాలి’ విషయంలోనూ మేకర్స్ అదే వ్యూహంతో విజయవంతమయ్యారు. ఈ చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ గత చిత్రాలైన ‘టాక్సీవాలా’, ‘శ్యామ్ సింగరాయ్’ విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించాయి. ఆయన నుంచి వస్తున్న మరో పీరియాడికల్ డ్రామాపై భారీ అంచనాలు ఉండటంలో ఆశ్చర్యం లేదు. మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట తెరపై కనిపించనుండటం, ముఖ్యంగా వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి ‘యూ/ఏ’ (U/A) సర్టిఫికెట్ లభిస్తే, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా పెద్ద ఎత్తున థియేటర్లకు క్యూ కట్టే అవకాశం ఉంది. దసరా సెలవుల జోరుతో ‘రణబాలి’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి. ఇక త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌తో ప్రస్తుత హైప్ మరింత రెట్టింపు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తెలుగులోకి ‘హనుమాన్ అంశ్’..

# రిలీజ్ డేట్ వచ్చేసింది!




ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన ‘హనుమాన్ అంశ్’ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయింది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది. కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

## ముప్పా రామారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యంగ్ స్టార్ యువజన సంఘం సభ్యులు



**కీసర( ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ అధ్యక్షులు ముప్పా రామారావు జన్మదినం సందర్భంగా గణేష్ టీం, 18వ వార్డు యంగ్ స్టార్ యువజన సంఘం సభ్యులు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముప్పా రామారావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈధ భాస్కర్, గంధమాల ప్రశాంత్, ఈధ ప్రవీణ్, గంగాధర్, టిల్లు, జెంగాల లడ్డు, దోసపల్లి సాయికిరణ్, కొత్తూరు సురేష్, మొతుకూరు బాబు, గంధమాల నితిన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# స్వచ్ఛతే మన అలవాటుగా మారాలి

**- స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రత ఉద్యమం**
**- స్వచ్ఛాంధ్ర--2026 అవార్డులు అందజేసిన సీఎం చంద్రబాబు**




**అమరావతి(ప్రశ్న న్యూస్)** స్వచ్ఛ చల్లపల్లిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. చల్లపల్లిలో ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం వచ్చి.. అది క్రమంగా అలవాటుగా మారిందని, ఫలితంగా పరిసరాల్లో చెత్త వేసే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. ఇదే తరహా స్వచ్ఛతా అలవాట్లు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో రావాలని ఆకాంక్షించారు.ప్రతి ఏడాది అక్టోబరు 2న నెట్‌జీరో, స్వచ్ఛత రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి అవార్డులు అందించే కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం సూచించారు. స్వచ్ఛతా వారియర్లు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు, పాఠశాలలు, ఆస్పత్రులు, ఆలయాలు తదితర విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి 'స్వచ్ఛాంధ్ర--2026' అవార్డులు అందజేశారు.

**స్వచ్ఛతలో చల్లపల్లి ఆదర్శం** స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని.. ప్రతి పౌరుడి బాధ్యతగా మారాలని సీఎం పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగి స్వచ్ఛతను నిత్యజీవితంలో భాగంగా చేసుకున్నప్పుడే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో చెత్త నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పునర్వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**పట్టణాలకు పురస్కారాలు** స్వచ్ఛతలో మెరుగైన పనితీరు కనబరిచిన మున్సిపాలిటీలకు అవార్డులు అందించారు. తెనాలి, చిలకలూరిపేట, మంగళగిరి, పొన్నూరు, బొబ్బిలి, రాజాం, యలమంచిలి, పలమనేరు, గిద్దలూరు మున్సిపాలిటీలు పురస్కారాలు దక్కించుకున్నాయి.వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన స్టార్టప్‌కు కూడా స్వచ్ఛతా అవార్డు అందించారు. విజయవాడ పాయకాపురం, కర్నూలు సీక్యాంప్, శ్రీకాకుళంలోని విల్లిస్ రైతుబజార్లు స్వచ్ఛతా అవార్డులు అందుకున్నాయి.హోటళ్ల కేటగిరీలో విశాఖపట్నంలోని నోవోటెల్ అవార్డు పొందింది.'చెత్త రహిత ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనకు ప్రజల భాగస్వామ్యమే కీలకం అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. స్వచ్ఛతను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా.. ప్రతి రోజూ పాటించే జీవన విధానంగా మార్చడమే లక్ష్యంగా చర్యలు కొనసాగనున్నాయి.

## ఇంద్రకీలాద్రికి 'స్వచ్ఛ ఆంధ్ర' పురస్కారం

**- పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ఉత్తమ పనితీరు**
**- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఈవో శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ**



విజయవాడ(ప్రశ్న న్యూస్) పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్న విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి రాష్ట్ర స్థాయి ప్రతిష్ఠాత్మక 'స్వచ్ఛ ఆంధ్ర అవార్డు--2026' దక్కింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర ఇనిషియేటివ్స్ లో భాగంగా ఈ పురస్కారానికి దేవస్థానం ఎంపికైంది.విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో దేవస్థానం తరఫున ఈవో వి.కె. శీనా నాయక్, ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

**ప్రమాణాల ప్రాతిపదికన ఎంపిక** ఆలయ ప్రాంగణ పరిశుభ్రత, వ్యర్థాల విభజన--సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ రహిత విధానాలు, భక్తుల్లో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఈవో, చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంతో పాటు పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది నిరంతర కృషితోనే ఈ గుర్తింపు లభించిందన్నారు. అవార్డును అమ్మవారి అనుగ్రహంగా భావిస్తున్నామని తెలిపారు.రానున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లోనూ పర్యావరణహిత చర్యలకు ప్రాధాన్యమిస్తూ, పరిశుభ్రతను కొనసాగించి భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

# పెళ్లి పేరుతో మోసం.. బెదిరింపులు

**- హైదరాబాద్‌లో నిందితుడి అరెస్టు.. అలిపిరి పోలీసుల దర్యాప్తు**



తిరుపతి(ప్రశ్న న్యూస్) పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బెదిరింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఓ యువకుడిని అలిపిరి పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి నిందితుడి ఆచూకీ గుర్తించింది.పోలీసుల వివరాల మేరకు.. జార్జియాలో ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలో బాధితురాలికి నిందితుడితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సన్నిహితంగా మెలిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌కు పిలిపించి కలిసినట్లు తెలిపారు. పెళ్లి విషయమై ప్రశ్నించగా తన మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, అంగీకరించకపోతే వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తానని, బంధువులకు పంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### హైదరాబాద్‌లో అరెస్టు

బాధితురాలి ఫిర్యాదుతో అలిపిరి పోలీసులు దీమీ సెక్షన్లు 69, 351(2) కింద కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్‌కు పంపారు. మలక్‌పేట, అక్బర్‌బాగ్‌లోని నివాసం వద్ద అక్టోబరు 1న ఉదయం 10.30 గంటలకు నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడిని మొహమ్మద్ రయాద్ ఖాద్రీ ఏ రయాద్ మొహమ్మద్ ఖాదర్ (24), హైదరాబాద్‌గా గుర్తించారు.

### మొబైల్ ఫోన్ స్వాధీనం

నిందితుడిని తిరుపతికి తీసుకొచ్చి విచారించిన పోలీసులు.. పంచుల సమక్షంలో శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్24 అల్ట్రా మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కీలక సాంకేతిక ఆధారాలు ఉన్నట్లు భావిస్తున్నామని, వాటిని పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు.

### విద్యార్థులకు సూచనలు

విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులు సోషల్ మీడియా పరిచయాలను గుడ్డిగా నమ్మవద్దని పోలీసులు సూచించారు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, సున్నితమైన సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదన్నారు. ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు పంచుకోవాలని తెలిపారు.వివాహం పేరుతో మోసం, వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ లేదా వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బెదిరింపులు ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, సైబర్ నేరాల కోసం 1930 లేదా సైబర్‌క్రైమ్ పోర్టల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఫిర్యాదులు అందిన వెంటనే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు.

# స్వచ్ఛ మారథాన్‌తో విజయవాడలో సందడి

**- 22 రాష్ట్రాల నుంచి 10 వేల మంది.. పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన**



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** పరిశుభ్రమైన నగరం.. ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛ మారథాన్‌కు విశేష స్పందన లభించింది. గాంధీ జయంతి సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి శుక్రవారం నిర్వహించిన 5కే, 10కే రన్‌లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి సుమారు 10 వేల మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ స్వచ్ఛ మారథాన్ కేవలం పరుగు కార్యక్రమం కాదని.. పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన పెంచే వేదిక అని తెలిపారు. యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమన్నారు. జుంబా కార్యక్రమంలో పాల్గొని యువతను ఉత్సాహపరిచారు.విజయవాడను స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని చిన్ని పేర్కొన్నారు. నగర పరిశుభ్రత ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా భావించాలని సూచించారు. గత ఏడాది ప్రారంభించిన స్వచ్ఛ మారథాన్‌కు వచ్చిన స్పందనతో ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందని తెలిపారు.

### ఉత్సవ్--2.0కు ఏర్పాట్లు

విజయవాడ ఉత్సవ్--2.0ను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్లు ఎంపీ తెలిపారు. పున్నమిఘాట్, మాకినేని బసవపున్నయ్య స్టేడియం, సిద్ధార్థ ఫార్మా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దసరా సందర్భంగా విజయవాడ వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటేందుకు ఉత్సవ్ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.మారథాన్‌తో పాటు నగరంలో జరిగే కార్యక్రమాల్లో భద్రతా నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపీ కోరారు.కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, బొండా సిద్ధార్థ, స్వచ్ఛాంధ్ర ఎండీ సునీల్‌కుమార్‌రెడ్డి, వీఎంసీ కమిషనర్ ధ్యాన్‌చంద్, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, హెచ్‌డీఎఫ్‌సీ స్టేట్ హెడ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

**- ఐటీడీఏ పీవో వైశాలి పిలుపు.. - బాపూజీకి ఘన నివాళి**



**పార్వతీపురం(ప్రశ్న న్యూస్)** గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పార్వతీపురం మన్యం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆర్.వైశాలి పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వైశాలి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సత్యం, అహింస, శాంతి విలువలను ఆచరణలో పెట్టడంతోపాటు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో సహాయ ప్రాజెక్ట్ అధికారి మురళీధర్‌తో పాటు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొని బాపూజీకి నివాళులర్పించారు.

# గాంధీజీకి కాంగ్రెస్ వేదిక

**- సత్యాగ్రహంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం**
**- డీసీసీ అధ్యక్షుడు దాలినాయుడు**



**పార్వతీపురం(ప్రశ్న న్యూస్)** అహింస, సత్యాగ్రహాన్ని ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాటాన్ని నడిపారని కాంగ్రెస్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు అన్నారు. గాంధీజీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం పార్వతీపురంలో కాంగ్రెస్ నాయకులు కార్యక్రమం నిర్వహించారు. గాంధీ విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దాలినాయుడు మాట్లాడుతూ గాంధీజీ 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు వచ్చిన అనంతరం జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. కాంగ్రెస్ కార్యకలాపాలను గ్రామస్థాయికి విస్తరించడంతో రైతులు, కార్మికులు, మహిళలు, పేదలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములయ్యారని చెప్పారు.లాల్‌బహదూర్ శాస్త్రి స్వాతంత్ర్యోద్యమ కార్యకర్తగా, కాంగ్రెస్ సంస్థాగత నాయకుడిగా, అనంతరం ప్రధానమంత్రిగా దేశానికి సేవలందించారని గుర్తుచేశారు. శాస్త్రి గాంధీజీ ఆలోచనలతో ప్రభావితమయ్యారని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోలా కిరణ్‌కుమార్, సిరిసపల్లి సాయి శ్రీనివాస్, గంట మోహన్‌రావు, సాలూరు కోఆర్డినేటర్ గేదెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

**- వైసీపీ రాజకీయంగా అడ్డుకుంటోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆరోపణ**



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చట్టబద్ధ పోరాటం కొనసాగిస్తుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆమె ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో హైకోర్టు తీర్పు వెలువడిందని మాధవి తెలిపారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తూనే తదుపరి న్యాయపరమైన మార్గంలో ముందుకు వెళ్తున్నామని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితి, అవసరమైన న్యాయపరమైన ప్రక్రియ వంటి అంశాలపై కోర్టు తీర్పులో అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

### బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మాధవి పేర్కొన్నారు. బీసీల జనాభా, సామాజిక వెనుకబాటుతనం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వారికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గాయని ఆమె ఆరోపించారు. దీనివల్ల బీసీలకు రాజకీయ అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై వైసీపీ గతంలో చేసిన విధానాలపై తాను చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలేనని, వాటిని సంబంధిత పార్టీలు భిన్నంగా వివరిస్తున్నాయని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మాధవి తెలిపారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

**- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఉచిత దర్శనం**




**విజయవాడ(ప్రశ్న న్యూస్)** గాంధీ జయంతి సెలవు, అమ్మవారికి ప్రీతిపాత్రమైన శుక్రవారం కలిసి రావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని రకాల దర్శనం టికెట్లను రద్దు చేసి ఉచిత దర్శనం కల్పించారు.

### లిఫ్టుల సేవలు తాత్కాలికంగా నిలిపివేత

ఘాట్ రోడ్డు మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో భక్తుల రాకపోకలను మహామండపం వైపు మళ్లించడంతో అక్కడ రద్దీ పెరిగింది. లిఫ్టుల వద్ద భక్తుల సంఖ్య అధికం కావడంతో భద్రతా కారణాల దృష్ట్యా వాటి సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. మహామండపం ర్యాంప్, పాత మెట్ల మార్గం ద్వారా భక్తులను క్రమపద్ధతిలో కొండపైకి అనుమతించారు.

### క్యూలైన్లలో తాగునీటి సరఫరా

దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ క్షేత్రస్థాయిలో పర్యటించి క్యూలైన్లు, రద్దీ నియంత్రణ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల వద్దకే స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అధికారుల సమన్వయంతో దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పది ఏళ్ల అధికారం.. జర్నలిస్టులకు ఏం చేశారు.?

- అప్పుడు పట్టని జర్నలిస్టుల సమస్యలు.. ఇప్పుడు విమర్శలా.?
- ఇండ్ల స్థలాల పేరుతో రిపోర్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం పై రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసం.?
- సుప్రీంకోర్టు ఆదేశాలని కాదని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వగలదా.?
- మరి మీ హయాంలో ఎందుకు ఇవ్వలేదు. ఇంకా పది సంవత్సరాలు గడిచిన రిపోర్టర్లకు ఇండ్ల స్థలాలు ఇప్పించే దమ్ముందా.?
- అక్రిడేషన్ కార్డులను మీ యూనియన్ సభ్యుల పేరుతో ఇతర యూనియన్ సభ్యులకు ఇవ్వకుండా అడ్డుకున్నారుగా
- మీ యూనియన్ నాయకుల కొడుకు సర్పంచ్ అయినా అక్రిడేషన్ ఇచ్చిన ఘనత మీదేగా
- అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి వత్తాసు పలకడం కొన్ని జర్నలిస్టు సంఘాలకు సభాబేనా.?
- ఇళ్ల స్థలాల నుంచి సంక్షేమ నిధుల వరకు.. పదేళ్ల పాలనపై ప్రశ్నల వర్షం
- అక్రిడిటేషన్, ఎంపానల్‌మెంట్, జర్నలిస్టుల భద్రతపై సమాధానం చెప్పాల్సిందే




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల సమస్యలపై ఇప్పుడు గొంతెత్తుతున్న నేతలు.. తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏం చేశారన్న తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నేడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఇదే అంశం ఎందుకు గుర్తుకు రాలేదని జర్నలిస్టు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలు, న్యాయపరమైన పరిమితులు ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని తెలిసి జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉసిగొల్పడం ఎంతవరకు సమంజసమని టీజేఎస్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మీరు అధికారంలో ఉన్న సమయంలో వాటిని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని పలు సంఘాల నేతలు పేర్కొన్నారు. పది సంవత్సరాలు మీరు అధికారంలో ఉన్నప్పుడు తీర్చలేని సమస్యలు ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత డిమాండ్‌గా ఎలా మారింది.?

### సంక్షేమ నిధి రూ.100 కోట్లు.. మరి ఎక్కడ.?

జర్నలిస్టుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం రూ.100 కోట్ల నిధి ఇచ్చిందని చెప్పారు కానీ ప్రభుత్వం సగం కూడా ఇవ్వలేదని పదేళ్ల తర్వాత చెప్పడం ఎంతవరకు సమంజసం. అదే స్థాయిలో పూర్తిస్థాయి నిధులు సమీకరించి జర్నలిస్టుల సంక్షేమానికి ఎందుకు వినియోగించలేదని, కరోనా సమయంలో సైతం జర్నలిస్టులను కనీసం ఆదుకోవాలని చిత్తశుద్ధి కూడా మీకు లేదన్న విమర్శలు మర్చిపోయారా.? ముఖ్యంగా కరోనా సమయంలో వేలాది మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, వారిని ఆదుకోవడంలో అప్పటి మీ పాత్ర ఏమిటో చెప్పాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

### అక్రిడిటేషన్‌లో అర్హతలపై ప్రశ్నలెందుకు.?

పదేళ్ల పాలనలో ఎన్ని అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేశారు.? అందులో నిబంధనలు, అర్హతలు ఎంతవరకు పాటించారు.? చిన్న, మధ్యతరహా పత్రికలు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు ఎలాంటి న్యాయం జరిగింది.? అన్న విషయాలపై పూర్తి లెక్కలు బయటపెట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ప్రెస్ క్లబ్.. సభ్యత్వాలు.. వివాదాలు

జర్నలిస్టుల సంస్థలు, ప్రెస్ క్లబ్‌ల విషయంలో అధికార ప్రభావం ఎంతవరకు పనిచేసింది.? కొందరు జర్నలిస్టులకు సభ్యత్వాలు దక్కకపోవడానికి కారణాలేమిటి.? ప్రెస్ క్లబ్ పేరుతో జరిగినట్లు వస్తున్న భూవ్యవహారాలు, విల్లాల వ్యవహారాలపై ఆరోపణలు నిజమైతే వాటిపై విచారణ ఎందుకు జరగలేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. కొంతమంది రిపోర్టర్ల పైన అక్రమ కేసులు పెట్టి ప్రెస్ క్లబ్ లో మెంబర్షిప్ ఇప్పియ్యలేదా.? ప్రెస్ అకాడమీని అడ్డుపెట్టుకొని విల్లా దొబ్బుకుంది ఎవరు.? మరికొంతమంది నేతలు ప్రెస్ క్లబ్ ను అడ్డుపెట్టుకొని ఫామ్ హౌస్ లో ఏర్పాటు చేసుకోలేదా.? ఈ వాస్తవాలు దాదాపు 90 శాతం మంది జర్నలిస్టులకు తెలియదుగా.? మరి బహిరంగంగా వీటిపై చర్చించుకుందామా.?

### భద్రత ఇప్పుడు మాత్రమే గుర్తొచ్చిందా.?

జర్నలిస్టులపై కేసులు, బెదిరింపులు, ఒత్తిళ్లు ఉన్నాయంటూ నేడు భద్రత కోరుతున్న నేతలు, తాము అధికారంలో ఉన్న సమయంలో, ప్రస్తుతం జర్నలిస్టులపై నమోదైన కేసులు, ఎదురైన ఇబ్బందులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలి. అప్పట్లో జర్నలిస్టుల భద్రత కోసం తీసుకున్న చర్యల పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

### ఎంపానల్‌మెంట్‌లో చిన్న పత్రికలకు న్యాయం జరిగిందా.?

పదేళ్ల పాలనలో ఎన్ని పత్రికలను ప్రభుత్వ ఎంపానల్‌మెంట్‌లోకి తీసుకున్నారు.? చిన్న పత్రికలు, స్థానిక పత్రికలు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు ఎలాంటి అవకాశాలు కల్పించారు.? అనే ప్రశ్నలకు గణాంకాలతో సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ జర్నలిస్టుల సమస్యలు మాత్రం ఎందుకు మారడం లేదు.? రాజకీయ అనుబంధాల ఆధారంగా జర్నలిస్టు నాయకత్వాన్ని ఎంపిక చేస్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకదని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు. జర్నలిస్టుల ఇళ్లు, భద్రత, సంక్షేమం, అక్రిడిటేషన్, ఎంపానల్‌మెంట్ వంటి అంశాలు రాజకీయ విమర్శలకు కాకుండా స్పష్టమైన విధానం, పారదర్శకత, జవాబుదారీతనంతో పరిష్కరించాల్సిన అంశాలు అని వారు చెబుతున్నారు.

## సామాన్యులను కాంగ్రెస్, బీఆర్ఎస్

# పట్టించుకోవడం లేదు

**- రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందన్న బీజేపీ చీఫ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వినోద రంగంలోని ప్రముఖులను చేర్చుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చేరికలు జరిగాయి.

# హైదరాబాద్‌లోని సంతోషిమాత

# ఆలయంలో విగ్రహంపై దాడి

**- పూజలు చేస్తుండగా కర్రలతో విగ్రహాన్ని కొట్టిన ఆగంతుకుడు**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామాంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ట్రై కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ

**- 76 ప్రాంతాల్లో జోన్లు, డివిజన్ల ఛేంజ్- ఎయిర్‌పోర్టు పీఎస్‌కు కొత్త పేరు- కొత్తగా ఉప్పల్ లా అండ్ ఆర్డర్ ట్రాఫిక్ డివిజన్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో పోలీస్ వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మార్పులు చేసింది. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా, మారుతున్న కాలనీలకు అనుగుణంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సరిహద్దుల్లో భారీ మార్పులు చేసింది. ఈ మేరకు తెలంగాణ హోంశాఖ జీవో నంబర్ 84 జారీ చేసింది. మొత్తం 76 ప్రాంతాలకు సంబంధించి పోలీసు పరిధులను పునర్వ్యవస్థీకరించినట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త పునర్వ్యవస్థీకరణలో పలు పోలీస్ స్టేషన్ల పరిధులను ఒక జోన్ లేదా డివిజన్ నుంచి మరో జోన్, డివిజన్‌కు మార్చారు. కొన్ని ప్రాంతాలను ఇతర కమిషనరేట్ల పరిధిలోకి కూడా బదిలీ చేశారు. ముఖ్యంగా సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోకి తీసుకెళ్లారు.అదే సమయంలో మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ ప్రాంతాల్లోనూ పోలీస్ స్టేషన్ల పరిధులను సవరించారు. రాజేంద్రనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్ ప్రాంతాలతో పాటు నగరంలోని కీలక ప్రాంతాలైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ పోలీస్ పరిధుల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ పునర్వ్యవస్థీకరణలో పేర్ల మార్పులు కూడా ఉన్నాయి. ఇప్పటివరకు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఆర్‌జీఐఏ) పోలీస్ స్టేషన్‌గా ఉన్న స్టేషన్‌ను ఇకపై శంషాబాద్ పోలీస్ స్టేషన్‌గా వ్యవహరించనున్నారు.
అలాగే ఆర్‌జీఐఏ డివిజన్‌ను శంషాబాద్ డివిజన్‌గా మార్చారు. దీంతో ఎయిర్‌పోర్టుకు సంబంధించిన పోలీస్ పరిపాలనా వ్యవస్థను స్థానిక భౌగోళిక పరిధికి అనుగుణంగా మార్చినట్టైంది. పోలీస్ డివిజన్ల పేర్లలోనూ కీలక మార్పులు చేశారు. ఇప్పటివరకు ఉన్న చిక్కడపల్లి డివిజన్‌ను కాచిగూడ డివిజన్‌గా సంతోష్‌నగర్ డివిజన్‌ను ఛత్రినాక డివిజన్‌గా మార్చినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక పోలీస్ స్టేషన్ల పరిపాలనా పరిధులను కూడా కొత్త డివిజన్లకు అనుగుణంగా సర్దుబాటు చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో కాచిగూడ, ఛత్రినాక పోలీస్ స్టేషన్లు ప్రత్యేక స్టేషన్లుగా నమోదై ఉన్నాయి.ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా బడంగ్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను రద్దు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలు, కాలనీలను సమీపంలోని ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలోకి మార్చారు. ఏ ప్రాంతం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనే వివరాలను కొత్త సరిహద్దుల ప్రకారం ఖరారు చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది, అధికారుల పరిధులు కూడా తాజా మార్పులకు అనుగుణంగా మారనున్నాయి. ఈ మార్పులు కేవలం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లకే పరిమితం కాలేదు. ట్రాఫిక్ పోలీస్ జోన్లు, డివిజన్ల పరిధులను కూడా పునర్వ్యవస్థీకరించారు.నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, కొత్తగా విస్తరిస్తున్న కాలనీలు, ప్రధాన రహదారులపై వాహనాల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఈ మార్పులు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలపై స్పందించే పోలీస్ అధికారుల పరిధులు కూడా మారనున్నాయి. మహిళల భద్రతకు సంబంధించిన ఉమెన్ సేఫ్టీ




వింగ్ పరిధుల్లోనూ ప్రభుత్వం మార్పులు చేసింది. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని జోనల్ సైబర్ సెల్‌ల పరిధులను కూడా పునర్వ్యవస్థీకరించారు. కొత్త పరిధుల ప్రకారం పోలీస్ అధికారుల పర్యవేక్షణ, ఫిర్యాదులపై స్పందన, దర్యాప్తు వంటి అంశాల్లో సమన్వయం మెరుగుపడేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు.జీహెచ్ఎంసీ పరిధిలో నగరం విస్తరిస్తుండటం, కొత్త కాలనీలు ఏర్పడటం, జనాభా పెరగడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ కమిషనరేట్ పరిధులను సవరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పోలీసింగ్‌ను మరింత సులభతరం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొత్త ఉత్తర్వుల అమలుతో హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలోని అధికారులు ఇకపై సవరించిన జోన్లు, డివిజన్లు, పోలీస్ స్టేషన్ల సరిహద్దుల ఆధారంగా విధులు నిర్వహించనున్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

**- ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.
గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# విదేశీ అప్పులపైనే పాక్ బతుకు

**- ఎగుమతులు పెరగకపోతే పెను సంక్షోభం!**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కొనసాగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి అందే రుణాలు, సౌదీ అరేబియా, చైనా వంటి మిత్ర దేశాలు ఇచ్చే డిపాజిట్లపైనే దేశం పూర్తిగా ఆధారపడి ఉంది. ఈ నిధులు ఎప్పటికప్పుడు తలెత్తుతున్న చెల్లింపుల సంక్షోభం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) నుంచి తాత్కాలికంగా గట్టెక్కిస్తున్నప్పటికీ, దేశానికి దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ఓ నివేదిక స్పష్టం చేసింది. 'డాన్' పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం పాకిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం తమ భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యతను అడ్డుపెట్టుకుని విదేశీ మద్దతు పొందడంపైనే దృష్టి సారించింది తప్ప, ఎగుమతి ఆధారిత సుస్థిర వృద్ధి నమూనాను నిర్మించలేకపోయింది.దీని ఫలితంగా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు పెరిగినప్పుడల్లా అది దిగుమతులు, వినియోగం ఆధారంగానే జరిగింది. దీంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు తరచూ అడుగంటిపోవడం, సంక్షోభం తలెత్తడం ఒక చక్రంలా కొనసాగుతోంది. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అప్పటి సైనిక పాలకుడి హయాంలో పాకిస్థాన్‌కు భారీగా విదేశీ నిధులు, రుణమాఫీ, పెట్టుబడులు వెల్లువెత్తాయి. అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడంలో పాలకులు విఫలమయ్యారు. ఆ నిధులన్నీ దిగుమతులు, వినియోగం, రియల్ ఎస్టేట్ రంగాలకు మళ్లడంతో 2008 నాటికి దేశం రికార్డు స్థాయిలో కరెంట్ ఖాతా లోటును ఎదుర్కొని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది.ముఖ్యంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) దేశంలో విద్యుత్ కొరతను తీర్చడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి దోహదపడింది. కానీ, విదేశీ రుణాలు తగ్గించుకోవడానికి అవసరమైన ఎగుమతుల వృద్ధిని మాత్రం సాధించలేకపోయింది. పైగా సీపీఈసీ ప్రాజెక్టుల కారణంగా దిగుమతులు మరింత పెరిగి 2018 నాటికి కరెంట్ ఖాతా లోటు మళ్లీ ఆందోళనకర స్థాయికి చేరింది. కరోనా మహమ్మారి తర్వాత తీసుకున్న ఉద్దీపన చర్యలు, ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కమోడిటీ ధరలు, రాజకీయ అనిశ్చితి వంటి అంశాలు పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ప్రస్తుతం దేశ విదేశీ మారక నిల్వలు పూర్తిగా ఐఎంఎఫ్ కార్యక్రమాలు, మిత్ర దేశాల డిపాజిట్లపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే, ఈ నిధులు దేశంలో ఆర్థిక కార్యకలాపాలను నేరుగా సృష్టించవని, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని తీసుకురావని నివేదిక హెచ్చరించింది. మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ నిధుల లభ్యత కూడా




ఎప్పుడూ ప్రమాదంలోనే ఉంటుంది. గతంలో అభివృద్ధి ఆధారిత సహాయం, పెట్టుబడులు పొందిన పాకిస్థాన్, ఇప్పుడు అధిక వడ్డీ రుణాలు, స్వల్పకాలిక డిపాజిట్లపై ఆధారపడే స్థితికి దిగజారిందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా ఎగుమతుల వృద్ధిపై దృష్టి పెట్టకపోతే, ఆర్థిక స్థిరీకరణ ప్రయత్నాలు దీర్ఘకాలిక స్తబ్దతగా మారే ప్రమాదం ఉంది. ఫలితంగా, పాకిస్థాన్ తక్కువ వృద్ధి రేటు, మరో విదేశీ మారక నిల్వల సంక్షోభం మధ్య చిక్కుకుపోయే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588